నేటి ఈవార్తలు దినపత్రిక

NETI EVARTHALU

Published from Jagitial
www.evarthalu.com

గురువారం THURSDAY 25-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 176 Issue: 176


25 డిసెంబర్ 2025 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:47 సూర్యాస్తమయం - సా. 5:45 తిథిః పంచమి మ. 1:39 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ధనిష్ఠ ఉ. 8:09 వరకు తరువాత శతభిష యోగం వజ్ర మ. 3:05 వరకు కరణం భాలవ మ. 1:39 వరకు కౌలవ రా. 1:44ం వరకు వర్జ్యం మ. 3:42 నుండి సా. 5:21 వరకు దుర్ముహూర్తం ఉ. 10:26 నుండి ఉ. 11:10 వరకు మ. 2:49 నుండి మ. 3:33 వరకు రాహుకాలం మ. 1:38 నుండి మ. 3:00 వరకు యమగండం ఉ. 6:47 నుండి ఉ. 8:09 వరకు గుళికాకాలం ఉ. 9:31 నుండి ఉ. 10:54 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:11 నుండి తె. 5:59 వరకు అమృత ఘడియలు రా. 1:34 నుండి తె. 3:13 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:38 వరకు గమనిక: “ం” అనగా మరుసటి రోజున




# జయము జయము బాహుబలి

## 6100 కిలోల శాటిలైట్ ప్రయోగం సక్సెస్.. నింగిలోకి చేరిన బ్లూ బర్డ్ బ్లాక్ 2

### షార్‌లో సంబురాలు.. కమ్యూనికేషన్ రంగంలో విప్లవం.. శాస్త్రవేత్తలను అభినందించిన ప్రధాని, ఇస్రో చైర్మన్

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ( ఇస్రో).. మరో అద్భుత ఘనతను తన ఖాతాలో వేసుకుంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అత్యంత శక్తివంతమైన బాహుబలి రాకెట్ (ఎల్‌వీఎం3-ఎం6) ద్వారా బుధవారం ఉదయం అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్-2 భారీ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్ శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ స్టేషన్ రెండో ప్రయోగ వేదిక నుంచి బుధవారం ఉదయం 8:55 గంటలకు ఈ ప్రయోగం చేపట్టారు. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ తయారు చేసిన 6,100 కిలోల బరువు ఉన్న ఈ బ్లూబర్డ్ బ్లాక్-2 శాటిలైట్‌ను.. భారత స్వదేశీ టెక్నాలజీతో రూపొందించిన ఎల్‌వీఎం3-ఎం6 వాహకనౌక.. నింగిలోకి తీసుకెళ్లింది.

శ్రీహరికోట, డిసెంబర్ 24 (ఈవార్తలు):భారత గడ్డ మీది నుంచి ప్రయోగించిన అత్యంత బరువైన ఉపగ్రహంగా ఇది రికార్డు సృష్టించింది. ఈ బ్లూబర్డ్ శాటిలైట్.. ప్రపంచవ్యాప్తంగా టెలికం రంగంలో పెను మార్పులను తీసుకురానున్నట్లు ఇస్రో వర్గాలు వెల్లడించాయి. ఇక ఎలాంటి స్పెషల్ డివైజ్‌లు పరికరాలు లేకుండానే సాధారణ స్మార్ట్‌ఫోన్‌లకు నేరుగా అంతరిక్షం నుంచి 4జీ, 5జీ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ఈ బ్లూబర్డ్ తరువాయి 2 వ పేజీలో...



# చెక్ క్లియరింగ్ రెండో దశ వాయిదా

చెక్కులు క్లియర్ చేసేందుకు అయ్యే సమయాన్ని గంటల వ్యవధిలోకి తగ్గించే కంటిన్యూస్ క్లియరింగ్ వ్యవస్థ అమలులో రెండో దశను భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) తాత్కాలికంగా వాయిదా వేసింది.

న్యూఢిల్లీ: బ్యాంకులు తమ కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకోవడానికి మరింత సమయం ఇస్తూ, చెక్ క్లియరింగ్ సిస్టమ్ రెండవ దశను తదుపరి నోటీసు వచ్చేవరకు వాయిదా వేసినట్లు ఆర్‌బీఐ బుధవారం ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది అక్టోబర్ 4న మొదటి దశ మొదలవగా, ఆ రోజు నుంచి చెక్కులను తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,893 |
| వెండి (గ్రాము): | రూ.244 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,741 |




# నీయవ్వ..!

## నీ ముఖం ఎన్నడన్నా చూసుకున్నావారా అద్దంలో..

### పేడమూతి, బోడిలింగం నువ్వుగూడ మాట్లాడుతవా?.. అయ్య పేరు చెప్పుకొని బతికెటోనివి నువ్వు

### కేటీఆర్‌పై సీఎం రేవంత్ వివాదాస్పద వ్యాఖ్యలు.. కోస్గి సభలో కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజం

కోస్గి, డిసెంబర్ 24 (ఈవార్తలు): ‘నీయవ్వ.. నీ ముఖం ఎన్నడన్నా చూసుకున్నావ్‌రా అద్దంలో. పేడమూతి, బోడిలింగం నువ్వు గూడా నా గురించి మాట్లాడుతవా? నువ్వెంత? నీస్థాయెంత? అయ్య పేరు చెప్పుకొని బతికెటోనివి నువ్వు. ఆంధ్రాలో గుంటూరులో, గుడివాడలో చదువుకున్నోనివి నువ్వు. నీకేం తెలుసు తెలంగాణ గురించి? మా పౌరుషం గురించి? నీ జాతినంతా తెచ్చుకో, ఎక్కడికి రావాలో చెప్పు. నీ అవ్వా.. లాగులో తొండలు విడిచి కొడతా బిడ్డా. నా సంగతి ఇంకా తెల్వదు. మీ నాయనను అడుగు ఇంటికెళ్లి చెప్తడు. అమెరికాలో బాత్‌రూంలో కడిగినట్లు అనుకున్నావా.. నాతో మాట్లాడుడంటే’ అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో రెచ్చిపోయారు సీఎం రేవంత్ రెడ్డి. బుధవారం నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన నూతన సర్పంచుల సన్మాన సభలో మాట్లాడిన ఆయన.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు టార్గెట్‌గా నిప్పులు చెరిగారు. ‘రెండేళ్ల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చి నా తోలు తీస్తానంటున్నారు. కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు అంటూ ధ్వజమెత్తారు. గతంలో నన్ను, నా కుటుంబాన్ని ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారు. పగ సాధించడం మెదలుపెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలిపెట్టానని రేవంత్ తరువాయి 2 వ పేజీలో...

## కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వ

నీయవ్వ.. నీ ముఖం ఎన్నడన్నా చూసుకున్నావ్‌రా అద్దంలో. పేడమూతి, బోడిలింగం నువ్వు గూడా నా గురించి మాట్లాడుతవా? నువ్వెంత? నీ స్థాయెంత? అయ్య పేరు చెప్పుకొని బతికెటోనివి నువ్వు. ఆంధ్రాలో గుంటూరులో, గుడివాడలో చదువుకున్నోనివి నువ్వు. నీకేం తెలుసు తెలంగాణ గురించి? మా పౌరుషం గురించి? నీ జాతినంతా తెచ్చుకో, ఎక్కడికి రావాలో చెప్పు. 2029లో 80 శాతంపైగా సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తాం. రెండోసారి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తా.. ఇదే నా సవాల్. నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం కల్వకుంట్ల కుటుంబాన్ని, కేసీఆర్‌ను అధికారంలోకి రానివ్వను.. ఇదే నా శపథం.

- సీఎం రేవంత్ రెడ్డి

# చేతగాని దద్దమ్మ

### నీటి ద్రోహంపై జవాబు చెప్పలేక నికృష్టపు మాటలు

### సొంత జిల్లానే దగా చేసి దగుల్బాజీ కూతలు

### ఓటుకు నోటుకు దొంగవు.. కోవర్ట్ బతుకు నీది

### సీఎం రేవంత్ తిట్లపై ‘ఎక్స్’లో కేటీఆర్ ఫైర్



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చేదగాని దద్దమ్మ అంటూ కౌంటర్ అటాక్ చేశారు. ఎక్స్ వేదికగా ‘నీటి ద్రోహంపై జవాబు చెప్పలేక నికృష్టపు మాటలా? జల హక్కులను కాపాడటం చేతగాని దద్దమ్మా.. పెద్ద నోరేసుకోని అహంకారంతో అరుస్తున్నవా?

హైదరాబాద్, డిసెంబర్ 24 (ఈవార్తలు): పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి..సొంత జిల్లానే దగా చేస్తున్నది చాలక దగుల్బాజీ కూతలు కూస్తున్నవా? తెలంగాణ సోయిలేని..రాష్ట్ర ప్రయోజనాలను రక్షించలేని కోవర్ట్ బతుకు నీది! అడ్డంగా దొరికిపోవడం..ఆగమాగం కావడం.. అడ్డదిడ్డంగా వాగడం నీకు అలవాటే కదా! నీటి హక్కులపై రాజీ పడ్డ నీ నిర్వాకాన్ని బయటపెడితే తట్టుకోలేక..చిల్లర డైలాగ్లతో చిందులు తొక్కుతున్నావు! విధ్వంసక పాలనతో ప్రజలను చావ గొడుతున్నవు.. వికృత మనస్తత్వంతో చావులు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ఒక జూలో కలిసి ఉన్న ఐదు చిలుకలను అధికారులు విడదీసి వేర్వేరు చోట ఉంచారు. ఇలా ఎందుకు అంటే.. జూ కి వచ్చిన సందర్శకులను ఈ చిలుకలు ఇష్టమొచ్చినట్లు తిడుతున్నాయట. వీటి తిట్లను తాళలేక జూ అధికారులు వాటిని విడదీయాల్సి వచ్చిందట. ఈ ఘటన యూకేలోని లింకన్‌షైర్ వైల్డ్ లైఫ్ పార్కులో చోటుచేసుకుంది.



# దేశంలో కొత్తగా 3 ఎయిర్‌లైన్స్

### ఇప్పటికే శంఖ్ ఎయిర్‌కు గ్రీన్ సిగ్నల్

### తాజాగా మరో రెండింటికి కేంద్రం పచ్చజెండా

న్యూఢిల్లీ: దేశీయ విమానయాన రంగంలో గుత్తాధిపత్యానికి గండిపడనుంది. ఇన్నాళ్లూ ఇండిగో వంటి ఎయిర్‌లైన్స్ ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టు ఉండేది. ఇకపై వారి ఆటలు సాగవు. దేశంలో కొత్తగా మూడు ఎయిర్‌లైన్స్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అల్ హింద్ ఎయిర్ , ఫ్లైఎక్స్‌ప్రెస్, శంఖ్ ఎయిర్ సంస్థలు విమానాలు నడిపేందుకు ఆమోదం తెలిపింది. అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ సంస్థలు కేంద్ర పౌర విమాయాన శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌లను అందుకున్నాయి. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన శంఖ్ ఎయిర్ తరువాయి 2 వ పేజీలో...

# ‘చలి’జ్వరం

### రాష్ట్రంలో దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

### వాతావరణ మార్పులతో వైరస్‌ల స్వైర విహారం

### జలుబు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న ప్రజలు

### మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి: వాతావరణశాఖ

### జాగ్రత్తగా ఉండాలి.. వైద్య నిపుణుల సూచన

2





# అవును.. కాంగ్రెస్‌లోనే ఉన్నా

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టీకరణ

### ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సమాచారం లేదని వెల్లడి

ఖైతరతాబాద్, డిసెంబర్ 24 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల చర్చలు ముదురుతున్న వేళ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక ప్రకటన చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని స్పష్టం చేసిన ఆయన, ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరు? వారు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారు? అన్న విషయాలు తనకు తెలియవని అన్నారు. ‘నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుంది’ అంటూ దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఐఎం కలిసి మొత్తం 300 డివిజన్లలో విజయం సాధిస్తాయని ఆయన ధీమా వ్యక్తం వేశారు. గ్రేటర్ హైదరాబాద్ అంతటా విస్తృతంగా ప్రచారం చేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వం తరువాయి 2 వ పేజీలో...




## అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, డిసెంబర్ 24 (ఈవార్తలు): తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 29న ఉదయం 10.30 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం -2 వ పేజీలో...

# ఆరావళి పర్వతాల్లో మైనింగ్ బ్యాన్

### కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

2



కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆరావళి పర్వత ప్రాంతాల్లో మైనింగ్‌పై నిషేధం విధిస్తున్నట్లుగా ప్రకటించింది.

# రాశి ఫలాలు

25.12.2025

మేషం: భాగస్వామ్య వ్యాపారాలు లాభాల బాట పడతాయి. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. దూరప్రాంతాల బంధువులు నుంచి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

వృషభం: బంధువులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు అనుకూలిస్తాయి. వృత్తి, వ్యాపారాలు ఆశించిన విధంగా రాణించి విశేషమైన లాభాలు పొందుతారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు తీసుకుని ముందుకు సాగడం మంచిది.

మిథునం: ముఖ్యమైన వ్యవహారాలలో సోదరుల నుంచి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు అందుతుంది. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో ఏర్పడిన అరోధాలను అధిగమిస్తారు. వ్యాపారస్తులకు మాత్రం పెట్టుబడులు అందుతాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. చిన్ననాటి మిత్రులతో కష్టసుఖాలను పంచుకొంటారు.

సింహం: నిరుద్యోగుల ప్రయత్నాలు చాలా కష్టం మీద ఫలిస్తాయి. దైవ చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. మొండి బాకీలు వసూలు అవుతాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు.

కన్య: ఉద్యోగాలలో తనకు బాధ్యతల నుండి ఉపశమనం కలుగుతుంది. సంతానం విద్య ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. మిత్రులతో ఏర్పడిన మాటపట్టింపులు తొలగిపోతాయి. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. దూరపు బంధువుల మిత్రుల నుండి అందిన సమాచారం కొంత ఆనందం కలిగిస్తుంది.

తుల: ఉద్యోగాలలో ఏర్పడిన చికాకులు అధికారుల సహాయంతో రాజి చేసుకుంటారు. గృహ నిర్మాణ విషయమై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొంటారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. బంధువుల నుంచి కీలక సమాచారం అందుతుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుంచి బయటపడతారు.

వృశ్చికం: భూ క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తొలగుతాయి. బంధువర్గం నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు ఫలిస్తాయి.

ధనస్సు: వృత్తి ఉద్యోగాలలో జీతభత్యాల విషయమై శుభవార్తలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

మకరం: ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. దైవ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు.

కుంభం: నూతన వ్యాపారాలు పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. రుణదాతల నుండి ఒత్తిడి తొలగుతుంది. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకొంటారు.

మీనం: ఉద్యోగాలలో ఎదురైన సమస్యల నుండి తెలివిగా బయటపడతారు. ధనాదాయం మార్గాలు పెరుగుతాయి. స్థిరాస్థి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. చిన్ననాటి మిత్రుల నుంచి కీలక సమాచారం అందుకొంటారు. జీవిత భాగస్వామితో విహార యాత్రలో పాల్గొంటారు.

# నీయవ్వ..!





తరువాయి 2 వ పేజీలో...

అన్నారు. నేను ప్రమాణం చేసినప్పుడే కూలబడ్డారు.. ఇంతకంటే పెద్ద శిక్ష ఇంకేం ఉంటుంది. ఫాంహౌస్‌ను కేసీఆర్ బందీఖానాగా మార్చుకున్నారు. చుట్టూ పోలీసులున్నారు. చర్లపల్లి, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుంది కదా.. అంటూ రేవంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నన్ను గెలకవద్దు.. మర్యాదగా ఉండదని మాట్లాడటం లేదు. నల్లమల నుంచి వచ్చి జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత సీఎం అయ్యా' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక కేసీఆర్ పాలనలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పాలమూరును పూర్తిగా ఎండబెట్టారని ఆరోపించారు. కేసీఆర్ వలస వచ్చి పాలమూరు ఎంపీ అయ్యాడని.. ఆ తర్వాత సీఎం అయ్యారని, కానీ పాలమూరుకు నీళ్లు మాత్రం రాలేదన్నారు. వేసుకోవడానికి బట్టలు, తిరగడానికి చెప్పులు లేని వాళ్లు పదేళ్లలో రూ.వేల కోట్ల ఆస్తులు, ఫామ్‌హౌస్‌లు వచ్చాయని రేవంత్ ప్రశ్నించారు. రెండేళ్ల తర్వాత మీడియా ముందుకు వచ్చిన కేసీఆర్ నాలుగు మంచి మాటలు చెబుతారని అనుకున్నామని, మనిషి ఏం మారలేదని సెటైర్లు వేశారు. ఆయన ఎమ్మెల్యేలు, మంత్రులు ఎన్నో పాపాలు చేశారని, కానీ తాను ఎవరి మీద కేసులు పెట్టి వేధించలేదని తెలిపారు. ఎవరి పాపాన్ని వాళ్లే అనుభవిస్తారని సైలెంట్‌గా ఉన్నానని తెలిపారు. కానీ, కేసీఆర్ మా తోలు తీస్తానని అంటున్నారని.. మా తోలు తీయడం కాదు.. మా సర్పంచ్‌లే మీ తోలు వలుస్తారని, చింతమడకలో చీరి చింతకు వేలాడదీస్తారని తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. కేసీఆర్ 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఇదేనా.. ఓ మాజీ ముఖ్యమంత్రి మాట్లాడే తీరు ఇలాగేనా అంటూ రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను విమర్శించారు. తాను కూడా కింది స్థాయి నుంచి వచ్చానని.. మాట్లాడటం తనకు వచ్చని అన్నారు. కొడుకు కేటీఆర్ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయిందని గొడవ పెడుతుంటే.. తండ్రి మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శిస్తున్నాడంటూ ఎద్దేవా చేశారు. తానేమి అమాయకులను దుబాయ్ పంపుతానని మోసం చేయలేదని.. ఆస్తి కోసం సొంత చెల్లిని మెడలు పట్టుకుని బయటకు నెట్టిన వ్యక్తి కేటీఆర్ అని అన్నారు. ఆమెకే సమాధానం చెప్పలేనోడు నాకు సవాలు విసరడం విడ్డూరంగా ఉందన్నారు. నీ అవ్వా.. లాగులో తొండలు విడిచి కొడతా బిడ్డా అంటూ కేటీఆర్‌కు వార్నింగ్ ఇచ్చారు. అమెరికాలో బాత్‌రూంలో కడిగినట్లు అనుకున్నావా.. నాతో మాట్లాడుడంటే అని రేవంత్ ఓ రేంజ్‌లో రెచ్చిపోయారు. 2028లోనూ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే 80 శాతానికిపైగా సీట్లతో అధికారంలోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఇప్పటికంటే రెండింతల మెజారిటీ ఖాయమని కామెంట్ చేశారు. ఒక్కసారి పాతాళంలోకి తొక్కితేనే ఇప్పటి వరకు బయటకు రాలేదని.. ఇక ముందు ఏం జరగుతుందో చూస్తూ ఉండండని మాస్ వార్నింగ్ ఇచ్చారు. పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రానికి ఏం చేశారో అసెంబ్లీలో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఎన్ని రోజులంటే అన్ని రోజులు అసెంబ్లీ సమావేశాలు పెడదామని అన్నారు. పార్టీ ఆఫీసులో మాట్లాడడు కాదు.. అసెంబ్లీకి రావాలని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. నీళ్లు, నిధులు, నియామకాలు, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఈ-కార్ రేసింగ్ సహా అన్ని అంశాలపై చర్చించేందుకు తాము సిద్ధమన్నారు. డీలిమిటేషన్‌లో సీట్లు పెరిగితే 100కు పైగా గెలవడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో ఓడించామని.. పంచాయతీ ఎన్నికల్లో పాతరేశామని తేల్చి చెప్పారు. భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ చరిత్ర ఖతమే. మీ పార్టీకి, మీకు భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్, కేసీఆర్ గతమే.. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్. గత చరిత్రతో ఒరిగేదేమీ లేదని స్పష్టం చేశారు.

## పంచాయతీలకు రూ.10 లక్షలు ఇస్తా

'నూతనంగా ఎన్నికైన సర్పంచు,ఉప సర్పంచు, వార్డుసభ్యులు ప్రజల ఆశలను వమ్ముచేయకుండా పని చేయాలి. గాంధీ కలలు గన్నట్టు గ్రామాల అభివృద్ధే దేశ అభివృద్ధికి చిహ్నం. కొడంగల్ నియోజకవర్గాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఎన్నికలు పూర్తి అయ్యాయి ఇక రాజకీయాలు వద్దు అభివృద్ధి ధ్యేయంగా పార్టీలకు అతీతంగా పని చేయాలి. చిన్నచిన్న విభేదాలు ఉంటే పక్కన పెట్టాలి గ్రామాల్లో కక్షలు పెంచుకోవద్దు. నాకు వచ్చిన ఈ అవకాశం మీ అభివృద్ధికే. రాష్ట్రంలోని 12706 గ్రామపంచాయితీలకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నిధులు ఇస్తాం. చిన్న పంచాయితీలకు 5 లక్షలు పెద్దగ్రామ సర్పంచులకు 10 లక్షలు నూతన సంవత్సరంలో ఇస్తాం. సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయండి. ప్రతి ఇంటికి రేషన్ కార్డులు ఇస్తాం. గ్రామాల్లో ఎవరికైన అర్హులకు సంక్షేమ పథకాలు రాకుంటే పేర్లు ఇస్తే వారికి ఇస్తాం. ఇందిరమ్మ చీరలు మేం ఇస్తున్న సారె లాంటిది. చదువే జీవితాల్లో వెలుగు తెస్తుంది పిల్లలకు మంచి విద్యను అందిస్తాం. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అల్పాహారం,నాణ్యమైన భోజనం అందిస్తాం. మార్చి 31 లోగా కేంద్రం నుంచి 3 వేల కోట్ల నిధులు గ్రామపంచాయితీలకు తీసుకొస్తా' అని పేర్కొన్నారు.

# జయము జయము బాహుబలి

మొదటి పేజీ తరువాయి

శాటిలైట్ అందిస్తుంది. ఇది అంతరిక్షంలో దాదాపు 2400 చదరపు అడుగుల విస్తీర్ణంలో తన యాంటెన్నాలను కలిగి ఉంటుంది. ఇది భూమికి దిగువ కక్ష్యలోనే అతిపెద్ద కమర్షియల్ కమ్యూనికేషన్ వ్యవస్థ కావడం విశేషం. షెడ్యూల్ ప్రకారం ఉదయం 8:54 గంటలకే ఈ ప్రయోగం జరగాల్సి ఉంది. కానీ ఇది 90 సెకన్ల పాటు ఆలస్యమైంది. అంతరిక్షంలో అప్పటికే తిరుగుతున్న ఇతర ఉపగ్రహాలు లేదా శకలాలతో ఢీకొనే ప్రమాదం ఉందని గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు.. ముందు జాగ్రత్తగా ఈ ప్రయోగాన్ని కొద్దిసేపు వాయిదా వేసి 8:55:30 గంటలకు రాకెట్‌ను నింగిలోకి పంపించారు. భారత బాహుబలి రాకెట్ నింగిలోకి విజయవంతంగా చేరడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష రంగంలో ఇదొక గొప్ప మైలురాయి అని అభివర్ణించారు. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తికి ఇది నిదర్శనమని.. భారత శాస్త్రవేత్తల కృషి గర్వకారణమని కొనియాడారు. ఇది ఎల్‌వీఎం3 రాకెట్ మూడో పూర్తి వాణిజ్య ప్రయోగమని.. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ వెల్లడించారు. 52 రోజుల స్వల్ప వ్యవధిలోనే 2 భారీ ప్రయోగాలను చేపట్టడం.. ఇస్రో సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. నవంబర్ 2వ తేదీన సీఎంఎస్-03 ప్రయోగాన్ని చేపట్టింది. ఇదే ఎల్‌వీఎం3 రాకెట్ గగన్‌యాన్ మిషన్‌కు కూడా పునాది అని ఇస్రో ఛైర్మన్ తెలిపారు. ఈ ఎల్‌వీఎం3 రాకెట్ 43.5 మీటర్ల ఎత్తు.. 640 టన్నుల బరువు కలిగి ఉంటుంది. ఈ రాకెట్‌లో మూడు ఇంజిన్లు ఉంటాయి. మొదటి దశలో ఘన, రెండో దశలో ద్రవ, మూడో దశలో క్రయోజెనిక్ ఇంజిన్లు ఉంటాయి. గతంలో వన్‌వెబ్ ఉపగ్రహాలను మోసుకెళ్లిన రికార్డును అధిగమించి.. ఇప్పుడు 6.1 టన్నుల భారంతో అగ్రస్థానంలో నిలిచింది.

## మరిన్ని వాణిజ్య ప్రయోగాలు : ఇస్రో ఛైర్మన్

భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలు చేపడతామని ఇస్రో ఛైర్మన్ శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మానవ రహిత ప్రయోగాలు, నావిగేషన్, ఎయిర్ స్పేస్ స్టేషన్, వీనస్ ఆర్బిట్ ప్రయోగాలు, వాణిజ్య ఒప్పందాలు జరుగుతాయని తెలిపారు. శ్రీహరికోట నుంచి చేపట్టిన రాకెట్ ప్రయోగం విజయవంతంగా నింగిలోకి చేరుకోవడంతో షార్ లో సంబరాలు మొదలయ్యాయి.

# అవును.. కాంగ్రెస్‌లోనే ఉన్నా

మొదటి పేజీ తరువాయి

అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. ఇటీవల బీఆర్ఎస్ తరపున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ గులాబీ పార్టీ పోరాటం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా ఎమ్మెల్యేలు తాము ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని చెబుతున్నారు. అయితే, ఈ పరిణామాలకు భిన్నంగా దానం నాగేందర్ మాత్రం బహిరంగంగా తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నానని అంగీకరించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# చెక్ క్లియరింగ్ రెండో దశ వాయిదా

మొదటి పేజీ తరువాయి

డిజిటల్‌గా క్లియర్ చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ దశ లో బ్యాంకులు చెక్కులను స్కాన్ చేసి ఎలక్ట్రానిక్‌గా ఇతర బ్యాంకులకు పంపు తాయి, డ్రా చేసుకునే బ్యాంకులు వాటి ని సాయంత్రం 7 గంటల్లోపు క్లియర్ చేస్తాయి. మరింత సులభంగా చెప్పా లంటే ప్రస్తుతం, ఫేజ్ 1 కింద చెక్కులను డిజిటల్‌గా ప్రాసెస్ చేసి, ఆ రోజు ముగిసే నాటికి (సాయంత్రం 7 గంటల్లోపు) క్లియర్ చేస్తాయి. బ్యాంక్ సకాలంలో స్పందించకపోయినా ఆటోమేటిక్ పద్ధతిలో ఆమోదం లభిస్తుంది. చెక్ క్లియరింగ్ వ్యవస్థలో రెండో దశ జనవరి 3 నుంచి మొదలు కావాల్సి ఉంది. ఈ దశను రియల్ టైం సెటిల్‌మెంట్ కోసం రూపొందించారు. ఈ విధానంలో చెక్కులు 3 గంటల్లోపు ధ్రువీకరించి, గంటల వ్యవధిలో సెటిల్‌మెంట్‌లు పూర్తి చేయనున్నారు. ఈ దశలో మొదటి దశ కంటే చాలా వేగంగా కస్టమర్లకు నిధులను అందించవచ్చు.

# ఆరావళి పర్వతాల్లో మైనింగ్ బ్యాన్

## కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆరావళి పర్వత ప్రాంతాల్లో మైనింగ్‌పై నిషేధం విధిస్తున్నట్లుగా ప్రకటించింది. అందుకు సంబంధించి పర్యావరణ శాఖ అధికారిక ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇకపై ఆరావళి పర్వత శ్రేణుల్లో ఎలాంటి మైనింగ్ జరగబోదని స్పష్టం చేసింది. ఆరావళి పర్వత శ్రేణులకు నష్టం కలిగేలా మైనింగ్ చేపట్టడంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. నవంబర్ 20న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆరావళి హిల్స్, రేంజెస్‌కు యూనిఫాం డెఫినిషన్ ఆమోదించింది. కమిటీ సిఫార్సుల ప్రకారం ఒక హిల్ స్థానిక భూమి నుంచి కనీసం 100 మీటర్లు ఎత్తు ఉండాలని నిర్ణయించారు. 500 మీటర్ల దూరంలో ఉన్న రెండు లేదా అంతకంటే ఎక్కువ హిల్స్‌తో కలిసి, మధ్యలో ఉన్న ప్రాంతాలు కూడా అందులో చేర్చారు. దీంతో అసలు వివాదం ఇక్కడే మొదలైంది. ఆరావళి యూనిఫాం డెఫినిషన్ ఆమోదం తర్వాత సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఉద్యమం సాగింది. ఎన్విరాన్‌మెంటలిస్టులు, యాక్టివిస్టులు ఆరావళికి మరణం శాసనం రాశారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో దేశ వ్యాప్తంగా ఈ అంశంపై విమర్శలు, ప్రదర్శనలు జరిగాయి.

# దేశంలో కొత్తగా 3 ఎయిర్‌లైన్స్

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే ఎన్వోసీ అందుకోగా.. 2026 నుంచి దీని సేవలు ప్రారంభమవుతాయని భావిస్తున్నారు. దేశంలో విమానయాన రంగం విస్తరిస్తోంది. దేశీయ విమానయాన మార్కెట్‌లో భాగస్వామ్యాన్ని పెంచాలనే ఉద్దేశంతో కొత్త సంస్థలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుతం తొమ్మిది దేశీయ విమానయాన సంస్థలు మాత్రమే నడుస్తున్నాయి. అక్టోబర్‌లో ఫ్లై బిగ్ సంస్థ సేవలు నిలిపివేయడంతో ఈ సంఖ్య తగ్గింది. కేరళకు చెందిన అల్ హింద్ గ్రూప్ విమానయాన రంగంలోకి ప్రవేశిస్తోంది. ఫ్లైఎక్స్‌ప్రెస్ కూడా మార్కెట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న సంస్థలలో ఒకటి. ఇప్పటికే అనుమతి పొందినశంఖ్ ఎయిర్ వచ్చే ఏడాది వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తోంది. దేశీయ విమానయాన మార్కెట్‌లో ఇండిగో, ఎయిర్ ఇండియా గ్రూప్ (ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్) కలిసి 90 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇండిగో ఒక్కటే 65 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. ఈ ఆధిపత్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం కొత్త సంస్థలను ప్రోత్సహిస్తోంది. ఇటీవల ఇండిగో సంక్షోభం ఈ రంగంలో ఒకే సంస్థపై ఆధారపడటం వల్ల కలిగే నష్టాలను తెలియజేసింది. ఈ నేపథ్యంలో కొత్త విమానయాన సంస్థల రాక ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ అనుమతుల గురించి మంగళవారం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. శంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ బృందాలతో మంత్రిత్వ శాఖ సమావేశమైందని, శంఖ్ ఎయిర్ ఇప్పటికే అనుమతి పొందిందని, మిగిలిన రెండు సంస్థలకు ఈ వారం ఎన్వోసీలు అందాయని ఆయన తెలిపారు. దేశీయ విమానయాన రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున, ఎక్కువ సంస్థలను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ విధానమని నాయుడు పునరుద్ఘాటించారు. ప్రాంతీయ అనుసంధానతను మెరుగుపరచడానికి ఉద్దేశించిన ఉడాన్ వంటి ప్రభుత్వ పథకాలు చిన్న విమానయాన సంస్థలకు సహాయపడ్డాయని ఆయన పేర్కొన్నారు. ఉడాన్ పథకం కింద, స్టార్ ఎయిర్, ఇండియా వన్ ఎయిర్, ఫ్లై91 వంటి విమానయాన సంస్థలు సేవలు తక్కువ ఉన్న మార్గాలలో తమ సేవలను విస్తరించాయి. చిన్న నగరాలను జాతీయ విమానయాన నెట్‌వర్క్‌తో అనుసంధానించడంలో ఇవి కీలక పాత్ర పోషించాయి. ఈ విభాగంలో ఇంకా వృద్ధికి అవకాశం ఉందని మంత్రి తెలిపారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తాజా డేటా ప్రకారం.. ప్రస్తుతం భారతదేశంలో ఇండిగో, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ప్రభుత్వ రంగ సంస్థ అలయన్స్ ఎయిర్, ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్, స్టార్ ఎయిర్, ఫ్లై91, ఇండియా వన్ ఎయిర్ వంటి విమానయాన సంస్థలు ఉన్నాయి.

# చేతగాని దద్దమ్మ

మొదటి పేజీ తరువాయి

కోరుతున్నవు! సభ్యత, సంస్కారంలేని నీచమైన నీ వాగుడును చూసి జనం ఛీదరించుకుంటున్నా ..ఛీకొడుతున్నా ఇంకా మారవా? పట్ట పగలు నోట్ల కట్టలతో దొరికిపోయిన ఓటుకు నోటు దొంగవు నీవు..అదే నీ స్థాయి! పనికిమాలిన శపథాలు చేయడం.. పత్తాలేకుండా పారిపోవడం నీకు వెన్నతో పెట్టిన విద్య! శాసన సభలో.. జనసభలో ప్రతిచోటా కాంగ్రెస్ జలద్రోహాన్ని ఎండగడతాం! పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రానికి నష్టం జరుగుతుంటే చూస్తు వూరుకోం.. పౌరుషంగల్ల బిడ్డలం ప్రశ్నిస్తాం! ఆత్మగౌరవం లేని ఢిల్లీ బానిసలం కాదు మేము..రైతన్నల హక్కులకు భంగం కలిగితే భగ్గున మండుతాం! తిట్లు..బూతులతో డైవర్షన్ డ్రామాలు ,తమాషాలు ప్రతీ సారి నడవవ్! జనం అన్నీ గమనిస్తున్నారు...సందర్భం వచ్చినప్పుడు తొక్కి నారతీస్తారు! 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయం! మళ్లా వందేండ్ల దాకా పుట్టగతులు లేకుండా పాతిపెట్టడం తథ్యం' అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ జారీ

మొదటి పేజీ తరువాయి

కానున్నాయి. కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించే అవకాశముంది. ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టులపై చేసిన వ్యయం ఇలా అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నట్లు సమాచారం.

# విద్య, ఉద్యోగవాణి

## నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు

2,322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించిన ఫస్ట్ ప్రొవిజనల్ లిస్టును ఎమ్‌హెచ్‌ఎస్ఆర్‌బీ రిలీజ్ చేసింది. ఈ మెరిట్ జాబితాపై డిసెంబర్ 27 వరకు అభ్యంతరాలు స్వీకరించనుంది. తర్వాత సెకండ్ ప్రొవిజనల్ లిస్ట్ విడుదల చేసి 2 పోస్టులకు ముగ్గురేసి చొప్పున వెరిఫికేషన్‌కు పిలవనుంది. ఎంపికైన అభ్యర్థులు వచ్చే నెలలో ఉద్యోగాల్లో చేరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గత ఏడాది నవంబర్ 23న పరీక్ష జరగగా, 40,423 మంది రాశారు.

# 'చలి' జ్వరం

## రాష్ట్రంలో దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
## వాతావరణ మార్పులతో వైరస్‌ల స్వైర విహారం
## మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి: వాతావరణశాఖ
## జాగ్రత్తగా ఉండాలి.. వైద్య నిపుణుల సూచన

హైదరాబాద్, డిసెంబర్ 24 (ఈవార్తలు): తెలంగాణను చలిపులి వణికిస్తోంది. భానుడి భగభగలు మాయమై.. ఎముకలు కొరికే చలి పంజా విసురుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో 'చలి జ్వరం' ఇంటింటినీ పలకరిస్తోంది. వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన ఈ మార్పులతో వైరస్‌లు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా ప్రతి ఇంటా జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పుల బాధితులు కనిపిస్తున్నారు. రానున్న మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. సాధారణంగా మన శరీర ఉష్ణోగ్రతను మెదడులోని హైపోథాలమస్ గ్రంథి నియంత్రిస్తుంది. అయితే, బయట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువకు పడిపోతే శరీరంలోని ఉష్ణ నియంత్రణ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో పలుచోట్ల ఉష్ణోగ్రతలు 5 నుంచి 13 డిగ్రీల మధ్యే రికార్డవుతుండటంతో బాడీ మెకానిజం దెబ్బతినే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల రక్తనాళాలు కుంచించుకుపోయి బీపీ పెరగడం, తద్వారా గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చలి నుంచి ఉపశమనం కోసం 'రెండు పెగ్గులు' వేయడం పరిష్కారం కాదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. మద్యం తాగేటప్పుడు రక్తనాళాలు వ్యాకోచించి శరీరానికి తాత్కాలికంగా వెచ్చదనం లభించినప్పటికీ, ఆ తర్వాత ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా పడిపోతే, అది 'హైపోథెర్మియా' వంటి ప్రాణాంతక స్థితికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రోజంతా గోరువెచ్చని నీటినే తాగాలని, ఇది గొంతు సమస్యలను దూరం చేయడమే కాకుండా శరీర ఉష్ణోగ్రతను స్థిరంగా ఉంచుతుందని చెబుతున్నారు. బయటకు వెళ్లేటప్పుడు స్వెట్టర్లు, మఫ్లర్లు, గ్లౌజులు తప్పనిసరిగా ఉపయోగించాలని, ముఖ్యంగా ముక్కు, చెవుల ద్వారా చలి గాలి లోపలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలని పేర్కొన్నారు. శ్వాసకోశ సమస్యలున్న వారు రోజుకు రెండుసార్లు ఆవిరి పడితే ఊపిరితిత్తులకు ఉపశమనం లభిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి తాజా ఆకుకూరలు, పండ్లు, ప్రోటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, ఆస్తమా రోగులు ఈ సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, తెల్లవారుజామున, అర్థరాత్రి వేళల్లో ప్రయాణాలు మానుకోవడం ఉత్తమమని, చలి తీవ్రత పెరిగే కొద్దీ బ్యాక్టీరియా విజృంభణ కూడా పెరుగుతుంది కాబట్టి స్వల్ప లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు.



# ఆంజన్న భూముల జోలికొస్తే ఖబర్దార్

**భక్తుల మనోభావాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆటలు**

**కొండగట్టు అంజన్న భూములకు బీఆర్ఎస్ రక్షణ**

**చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టీకరణ**

మల్యాల, డిసెంబర్ 24 (ఈవార్తలు): కొండగట్టు అంజన్న భూముల జోలికొస్తే ఖబర్దార్ అని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హెచ్చరించారు. గుట్టపై అటవీశాఖ అధికారులు వేసిన మార్కింగ్‌ను ఆయన పరిశీలించారు. అంజన్నను దర్శించుకొని గుట్ట కింద ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కొండా సురేఖ రెండు శాఖలకు మంత్రిగా ఉన్నారు. కొండగట్టు అంజన్న ఆలయానికి వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలి. అంజన్న భూమిలోకి అడుగు పెడితే భక్తుల ఆగ్రహానికి గురవుతారు. భూములను పరిరక్షించుకునేందుకు ఆందోళన చేస్తాం. జై శ్రీరాం అని, దేవుళ్ల పేర్లు చెప్పుకుని రెండు సార్లు ఎంపీగా గెల్చిన బండి సంజయ్ కొండగట్టు అంజన్న భూముల గురించి ఎందుకు స్పందించడం లేదు? పదవులు పొందే వరకు దేవుళ్ల పేర్లు, హిందువుల పేర్లు చెప్పుకుని ఇప్పుడు విస్మరిస్తున్నారు. కేంద్ర మంత్రి కొండగట్టుకు రండి.. హిందువు బిడ్డవైతే అంజన్న భూములు కాపాడాలి. నెల రోజులైనా ఎందుకు స్పందించలేదో చెప్పాలి. అంజన్న ఆలయానికి 500 ఎకరాలు అప్పగించేందుకు చొరవ తీసుకోవాలి. బండి సంజయ్‌కు అంజన్న భూములు విషయం కనపడడం లేదా?' అని నిలదీశారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలోనే అంజన్న క్షేత్ర అభివృద్ధికి వంద కోట్లు మంజూరు చేశామన్నారు. 'శిలాఫలకాలు వేసుకో.. రీల్స్ చేసుకో.. ఫ్లెక్సీలు కట్టుకో.. కానీ అంజన్న ఆలయాన్ని అభివృద్ధి చెయ్యి అంటూ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు.

# అక్రెడిటేషన్ మా హక్కు

**మీడియా కార్డుల పేరుతో మోసం చేయొద్దు.. జీవో 252ను సవరించి తీరాల్సిందే: డెస్క్ జర్నలిస్టులు**

**డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆవిర్భావం**

**అధ్యక్ష, కార్యదర్శులుగా బాదిని ఉపేందర్, మస్తాన్ ఎన్నిక**

హైదరాబాద్, డిసెంబర్ 24 (ఈవార్తలు): వర్కింగ్ జర్నలిస్టుల మధ్య అధికారులు చిచ్చు పెట్టొద్దని, అక్రిడిటేషన్ల జారీలో వివక్ష చూపొద్దని డెస్క్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు తీసేసి, మీడియా కార్డులు ఇస్తామనడం సరికాదన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో వివిధ పత్రికలు, ఛానళ్లలో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 'డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ' (డీజేఎఫ్‌టీ) పేరిట నూతన సంఘం ఏర్పాటు చేశారు. ఈ మీటింగ్‌లో జీవో 252పై జర్నలిస్టులు చర్చించారు. రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు కలిస్తేనే వార్త అవుతుందని.. అట్లాంటప్పుడు ఈ విభజన ఎందుకని డీజేఎఫ్‌టీ నేతలు ప్రశ్నించారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే తీరును మానుకోవాలన్నారు. మీడియా కార్డుల పేరుతో డెస్క్ జర్నలిస్టులను సెకండ్ గ్రేడ్ సిటిజన్లుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేస్తున్న తమకు.. అక్రెడిటేషన్ ఇవ్వకపోవడం అంటే కష్టపడి సాధించుకున్న హక్కును గుంజుకోవడమేనని మండిపడ్డారు. కేవలం సంక్షేమ పథకాలు, ఇండ్ల స్థలాల కేటాయింపులో కోత పెట్టేందుకే ఈ స్క్రీనింగ్ చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. బస్ పాసుల విషయంలోనూ ఐఅండ్ పీఆర్ ఆఫీసర్లు క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హెచ్‌యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్, టీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి నవీన్ డబ్ల్యూజే రాష్ట్ర సెక్రటరీ రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని మద్దతు ప్రకటించారు.



**కొత్త కార్యవర్గం ఇదే..**

డీజేఎఫ్‌టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా మస్తాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కేవీ రాజారామ్, జాయింట్ సెక్రెటరీగా విజయ, ట్రెజరర్‌గా నిస్సార్ బాధ్యతలు స్వీకరించారు.

**డిమాండ్లు - తీర్మానాలు..**

డెస్క్ జర్నలిస్టులకు ఎప్పటిలాగే అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలి.

వర్కింగ్ జర్నలిస్టులను వేరు చేసేలా ఉన్న జీవో 252 ను వెంటనే సవరించాలి.

అక్రెడిటేషన్ కమిటీల్లో డెస్క్ జర్నలిస్టులకు చోటు కల్పించాలి.

రాష్ట్రంలో ఐ అండ్ పీఆర్ కమిషనర్, జిల్లాల్లో కలెక్టర్లను కలిసి మెమోరాండం ఇవ్వాలి.

హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేయాలి.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డెస్క్ జర్నలిస్టులందరినీ ఏకం చేసి, హక్కుల సాధన కోసం ఇతర సంఘాలతో కలిసి పోరాడాలి.



# మూడేళ్ల హామీ నెరవేర్చిన పవన్

గుంటూరు, డిసెంబర్ 24 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ బుధవారం గుంటూరు జిల్లా ఇప్పటం గ్రామాన్ని సందర్శించారు. మూడేళ్ల క్రితం ఇచ్చిన హామీ మేరకు అక్కడ నివసిస్తున్న వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మను ఆయన కలిశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న పవన్ కల్యాణ్, ఆప్యాయంగా ఆమెను ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరమ్మకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందిస్తానని, ఆమె మనవడి విద్య కోసం మరో రూ.లక్ష అందజేస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. అంతేకాదు తన జీతం నుంచి ప్రతి నెలా రూ.5 వేల సాయం చేస్తానని హామీ ఇచ్చారు. "నాలుగు రోజులుగా రావాలనుకున్నాను కానీ అధికారిక పనుల వల్ల వీలుకాలేదు. ఈరోజు మాత్రం మీకిచ్చిన మాట నిలబెట్టుకోవడానికి అన్ని పనులు వాయిదా వేసుకుని వచ్చాను" అంటూ పవన్ భావోద్వేగంగా మాట్లాడారు .2022 నవంబర్‌లో పవన్ కల్యాణ్ ఇప్పటం గ్రామాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ కోసం భూములు ఇచ్చిన గ్రామస్తుల ఇళ్లు అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో కూల్చివేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో నాగేశ్వరమ్మ పవన్ కల్యాణ్‌ను కలిసి, ఎన్నికల్లో గెలిచిన తర్వాత తన ఇంటికి రావాలని కోరగా ఆయన మాటిచ్చారు. 2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో పవన్ కల్యాణ్ తన మాటను నిలబెట్టుకుంటూ ఇప్పటం గ్రామానికి వచ్చారు. ఇది ఆయన రాజకీయ జీవితానికి మాత్రమే కాదు, వ్యక్తిగత విలువలకు కూడా నిదర్శనంగా నిలిచిందని గ్రామస్తులు అంటున్నారు.

# పీపీపీపై వెనక్కి తగ్గం

**ఏపీ సీఎం చంద్రబాబు**




అమరావతి, డిసెంబర్ 24 (ఈవార్తలు): పేదలకు నాణ్యమైన వైద్య విద్య, వైద్య సేవలు అందించే విషయంలో ఎక్కడా రాజీపడేది లేదని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలోనే వైద్య కళాశాలల నిర్మాణం చేపడతామని, దీనిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఇవాళ వైద్యారోగ్య శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పీపీపీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానాన్ని అధికారులు సీఎంకు వివరించారు. ఈ పథకం కింద వైద్య రంగంలోని ప్రాజెక్టులకు అయ్యే వ్యయంలో 60 శాతం వరకు ఆర్థిక మద్దతు లభిస్తుందని, ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 30 శాతం వాటాను భరిస్తాయని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్రం అనుమతులు ఇచ్చిందని పేర్కొన్నారు. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలోనూ వీజీఎఫ్ అమలు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో తొలి విడతగా ఆదోని, మదనపల్లి, పులివెందుల, మార్కాపురం మెడికల్ కాలేజీల నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణానికి ఒక సంస్థ ముందుకు రాగా, ఆ సంస్థతో వెంటనే ఒప్పందం చేసుకొని పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. మిగిలిన కళాశాలల టెండర్ల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన "సంజీవని"పైనా సీఎం సమీక్షించారు. కుప్పంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ, త్వరలోనే ఈ ప్రాజెక్టును చిత్తూరు జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# అటెండర్‌కు రూ.కోటి ఆస్తులు


**వైజాగ్ ఏసీబీ సోదాల్లో షాకింగ్ నిజాలు**




వైజాగ్, డిసెంబర్ 24 (ఈవార్తలు): విశాఖపట్నం జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఎంత లోతుగా పాతుకుపోయిందో ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) సోదాల్లో బయటపడుతోంది. నవంబర్ నెలలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేపట్టిన తనిఖీల దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దర్యాప్తులో భాగంగా నిన్న ఏసీబీ అధికారులు పలువురు ఉద్యోగుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. సూపర్‌బజార్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఆనంద్‌కుమార్ ఇంట్లో ఏసీబీ అధికారులు సుమారు రూ. కోటి విలువైన స్థిర, చరాస్తులను గుర్తించి షాక్‌కు గురయ్యారు. ఒక అటెండర్ స్థాయిలో పనిచేసే వ్యక్తి ఇంత భారీ ఆస్తులు ఎలా కూడబెట్టాడనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుధారాణి నివాసంలోనూ దాదాపు కోటి రూపాయల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. ఇక సబ్‌రిజిస్ట్రార్ మోహనరావు నివాసంలోనూ స్థిరాస్తులు, చరాస్తులకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో నగదు, బంగారు ఆభరణాలు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ముఖ్యమైన పత్రాలు లభించడంతో అధికారులు దర్యాప్తును మరింత విస్తృతం చేశారు. ముందుగా నవంబర్ 5న సూపర్‌బజార్ కార్యాలయంతో పాటు పెదగంట్యాడ, మధురవాడ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఏసీబీ అధికారులు, లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల పాటు కీలక డాక్యుమెంట్లను పరిశీలించిన అనంతరం, మంగళవారం ఒకేసారి నాలుగు చోట్ల సిబ్బంది ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఈ దాడులు ప్రభుత్వ కార్యాలయాల్లోని అవినీతిని బయటపెట్టడంలో కీలకంగా మారాయి. ఈ కేసులో మరిన్ని కీలక నిజాలు బయటపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అవినీతి నిర్మూలన దిశగా ఏసీబీ దర్యాప్తు మరింత కఠినంగా కొనసాగనుంది.

# ఎన్నారైలకు సుపథం మార్గంలో దర్శనం

తిరుమల, డిసెంబర్ 24 (ఈవార్తలు): తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం అనేది కోట్లాది భక్తుల కల. దేశంలోనే కాకుండా విదేశాల్లో నివసిస్తున్న తెలుగువారు, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా భారతదేశానికి వచ్చిన ప్రతిసారీ తిరుమల యాత్రను తమ ప్రయాణంలో భాగంగా చేసుకుంటారు. ఈ నేపథ్యంలో విదేశాల నుంచి వచ్చే భక్తుల సౌలభ్యం కోసం టీటీడీ ఎన్నారైలకు ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఎన్నారై భక్తులు తిరుమలలోని సుపథం మార్గం ద్వారా నేరుగా శ్రీవారి దర్శనానికి వెళ్లవచ్చు. ఈ దర్శనానికి ముందస్తుగా ఆన్‌లైన్ బుకింగ్ అవసరం లేదు. అవసరమైన డాక్యుమెంట్లను చూపించి ఒక్కొక్కరికి రూ.300 చెల్లించి టికెట్ పొందవచ్చు. సాధారణంగా ఈ ప్రత్యేక దర్శనం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. భక్తుల రద్దీని బట్టి సమయాల్లో మార్పులు ఉండొచ్చు. ఈ దర్శనానికి



వచ్చే భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులు ధరించాలి. అలాగే, భారత్‌కు వచ్చిన తేదీ నుంచి 30 రోజుల లోపు మాత్రమే ఈ ప్రత్యేక ఎన్నారై దర్శనానికి అర్హులు. దర్శన సమయంలో ఒరిజినల్ పాస్‌పోర్టు తప్పనిసరి. పాస్‌పోర్టులోని ఇమ్మిగ్రేషన్ అరైవల్ స్టాంప్ ఆధారంగా అధికారులు ధ్రువీకరిస్తారు. ఓవర్‌సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా లేదా పీఐఓ కార్డు ఉన్నవారు వాటిని కూడా చూపించాలి. ఎన్నారై భక్తులతో పాటు వచ్చిన స్థానిక కుటుంబ సభ్యులకు సుపథం మార్గం ద్వారా దర్శనం అనుమతి ఉండదు. వారు సాధారణ భక్తుల్లాగానే ఆన్‌లైన్‌లో రూ.300 ప్రత్యేక దర్శన టికెట్ బుక్ చేసుకోవాలి. దర్శనం మాత్రమే కాకుండా, తిరుమలలో వసతి, ఆర్జిత సేవల కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ తప్పనిసరి. తిరుమలలో ఎప్పుడూ భారీ రద్దీ ఉండటంతో విదేశాల నుంచి వచ్చే భక్తులు కనీసం 60 రోజుల ముందుగానే వసతి బుక్ చేసుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవలకు లక్కీడిప్ విధానం అమలులో ఉంది. ఈ సేవల కోసం పాస్‌పోర్టు వివరాలు ఇవ్వాలి. దర్శనం లేదా వసతి సమయంలో బుకింగ్‌లో ఉపయోగించిన అసలు పాస్‌పోర్టును చూపించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు పాటిస్తే, ఎన్నారై భక్తులు ప్రశాంతంగా, సులభంగా తిరుమల శ్రీవారి దర్శనాన్ని పూర్తి చేసుకోవచ్చు.



కరీంనగర్‌లో బుధవారం జరిగిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో భాగంగా మల్యాల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గెలిచిన బొట్ల జయ ప్రసాద్‌ను సన్మానిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

# సంక్రాంతికి గ్రామాల్లో అన్న క్యాంటీన్లు

అమరావతి, డిసెంబర్ 24 (ఈవార్తలు): గ్రామీణ ప్రజలకు సంక్రాంతి కానుకగా ఏపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఒకేసారి 70 అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న క్యాంటీన్ల నిర్మాణ పనులు జనవరి 10లోగా పూర్తి చేయనుండగా, జనవరి 13 నుంచి 15 మధ్య క్యాంటీన్లు ప్రారంభించే యోచనలో ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో 205 అన్న క్యాంటీన్లు ప్రారంభించి కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. వీటిలో రోజూ మూడు పూటలా కలిపి 2 లక్షల మందికిపైగా ప్రజలు భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని పూటకు రూ.5కే అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యేల విజ్ఞప్తి నేపథ్యంలో ప్రభుత్వం మరో 70 క్యాంటీన్లను మంజూరు చేసింది. పట్టణాలు, నగరాల్లో కొనసాగుతున్న 205 అన్న క్యాంటీన్ల ద్వారా ఇప్పటి వరకు 7.20 కోట్ల మందికిపైగా పేదలకు ఆహారం అందించారు. వీరిలో 3.16 కోట్ల మంది మధ్యాహ్న భోజనం చేయగా, 2.62 కోట్ల మంది ఉదయం అల్పాహారం, 1.42 కోట్ల మంది రాత్రి అల్పాహారం పొందారు. విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అన్న క్యాంటీన్లకు అత్యధిక స్పందన లభిస్తోంది.

# ఏపీలో ఈ నెలాఖరు నుంచి కుటుంబ సర్వే

అమరావతి, డిసెంబర్ 24 (ఈవార్తలు): ఏపీలో సంక్షేమ పథకాలు, ప్రభుత్వం అందించే ప్రయోజనాల అమలు కోసం ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెలాఖరు నుంచి సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించనున్నట్లు ప్రకటించింది. పేదరిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన ఈ సర్వే ద్వారా కుటుంబాలు, పౌరుల వివరాలను సమగ్రంగా సేకరించి, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ సర్వే ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు, నివాస పరిస్థితులు, ఆదాయం, ఉపాధి, విద్య, ఆరోగ్య సమాచారం వంటి అంశాలను డిజిటల్ రూపంలో నమోదు చేయనున్నారు. సేకరించిన డేటాను ఆర్‌టీజీఎస్ డేటా లేక్‌లో భద్రపరిచి, భవిష్యత్ విధాన నిర్ణయాలకు వినియోగించనున్నారు. సర్వే నిర్వహణ బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అప్పగించారు. గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేపడతారు. జిల్లా కలెక్టర్లు, ప్లానింగ్, ఆర్టీజీఎస్ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం అమలవుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నెలాఖరు నుంచి సర్వే ప్రారంభమై, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

# చలిలో పొలం పనుల్లో పరిటాల సునీత

అనంతపురం, డిసెంబర్ 24 (ఈవార్తలు): నిరంతరం ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ కార్యలాపాలతో బిజీగా ఉండే టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత తమ పొలంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. తమ స్వగ్రామం వెంకటాపురంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె సందర్శించారు. ఉదయం చలిలో పొలంలోకి వెళ్లిన ఆమె... అప్పటికే అక్కడ పనుల్లో నిమగ్నమైన కూలీలతో మమేకమయ్యారు. అక్కడ సాగు చేస్తున్న వివిధ పంటలను పరిశీలించారు. పొలంలో ఉన్న మిరపకాయలను కోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వ్యవసాయంలో ఉండే సంతృప్తి మరెక్కడా ఉండదని చెప్పారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మరోవైపు, పరిటాల సునీత వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఆక్స్‌ఫర్డ్ వేదికగా పాక్‌పై 'సర్జికల్ స్ట్రైక్'

**ముంబై యువకుడి దెబ్బకు దాయాది విలవిల**



న్యూఢిల్లీ: ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనియన్ చర్చా వేదికగా భారత్-పాక్ మధ్య జరిగిన వాదోపవాదాలలో ఒక భారతీయ విద్యార్థి పాకిస్థాన్ తీరును చీల్చి చెండాడారు. ముంబైకి చెందిన వీరాంశ్ భానుశాలి అనే లా విద్యార్థి, పాకిస్థాన్ ప్రాయోజిత ఉగ్రవాదంపై చేసిన ప్రసంగం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. నిజానికి ఈ చర్చా కార్యక్రమం చుట్టూ పెద్ద వివాదమే నడిచింది. ఆక్స్‌ఫర్డ్ యూనియన్ ప్రెసిడెంట్ మూసా హర్రాజ్ (పాక్ రక్షణ శాఖ మంత్రి కుమారుడు), భారత ప్రతినిధులకు ఆహ్వానాలు అందకుండా చేసి, భారత్ తప్పుకుందని తప్పుడు ప్రచారం చేశారు. అయితే, విద్యార్థుల స్థాయిలో జరిగిన చర్చలో వీరాంశ్ భానుశాలి పాక్ బృందాన్ని ఉక్కిరిబిక్కిరి చేశారు. ముంబై దాడుల వార్షిక దినమైన నవంబర్ 26 మరుసటి రోజే ఈ చర్చ జరగడం విశేషం. 2008లో ముంబై ఉగ్రదాడి జరిగినప్పుడు తన వయస్సు చాలా తక్కువని, తన ఇంటికి కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న సీఎస్ఎంటీ స్టేషన్‌లో జరిగిన మారణకాండను కళ్లారా చూశానని వీరాంశ్ భావోద్వేగంగా చెప్పారు. "సిగ్గు లేని దేశాన్ని మనం ఎప్పటికీ సిగ్గుపడేలా చేయలేము. భారత్ తన ఆత్మరక్షణ కోసం తీసుకునే చర్యలు 'పాప్యులిజం' (ప్రజాకర్షక రాజకీయాలు) కాదు.. అది బాధ్యత" అని ఆయన స్పష్టం చేశారు. పాకిస్థాన్‌ను ఓడించడానికి తనకు ఎలాంటి ఆర్భాటపు మాటలు అవసరం లేదని, కేవలం ఒక 'క్యాలెండర్' ఉంటే చాలని వీరాంశ్ ఎద్దేవా చేశారు. 1993 పేలుళ్ల సమయంలో ఎన్నికలు లేవు, కానీ పాక్ ఐఎస్ఐ ముంబైని రక్తపాతం చేసింది. 26/11 తర్వాత భారత్ ఎంతో ఓపిక పట్టిందని, కానీ ఆ శాంతి కాముకత మనకు పఠాన్‌కోట్, ఉరి, పుల్వామా దాడులను మిగిల్చిందని దుయ్యబట్టారు. ఇటీవల జరిగిన సైనిక చర్య ఎన్నికల కోసం కాదని, అమాయక పర్యాటకులను చంపిన ఉగ్రవాదులకు బుద్ధి చెప్పడానికేనని ఆయన వివరించారు. పాకిస్థాన్ అంతర్గత పరిస్థితులపై వీరాంశ్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. "మీ దేశ ప్రజలకు రొట్టెలు (ఆహారం) ఇవ్వలేరు, అందుకే వారికి యుద్ధం అనే సర్కస్‌ను చూపిస్తున్నారు. పేదరికాన్ని అధికారంగా మార్చుకోవడానికి యుద్ధ భయాన్ని వాడుకుంటున్నారు" అని పాక్ ప్రతినిధి మూసా హర్రాజ్ ముందే ఆయన కుండ బద్దలు కొట్టినట్టుగా చెప్పారు. "మేము ఉల్లిపాయలు, విద్యుత్ వ్యాపారం చేసుకునే మంచి పొరుగువారిగా ఉండాలని కోరుకుంటున్నాం. కానీ మీరు ఉగ్రవాదాన్ని విదేశాంగ విధానంగా వాడుకున్నంత కాలం, మేము సిద్ధంగానే ఉంటాం" అని వీరాంశ్ తన ప్రసంగాన్ని ముగించారు. ఒక పాక్ మంత్రి కుమారుడు చర్చను అడ్డుకోవాలని చూసినా, ఒక భారతీయ విద్యార్థి వాస్తవాలతో పాక్ అసలు రంగును ప్రపంచం ముందు బయటపెట్టారు.

## ఏఐ ఫీచర్స్‌తో కెనరా బ్యాంక్ కొత్త యాప్



ముంబై: ఏఐ ఫీచర్లతో కెనరా బ్యాంక్ నూతన యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లావాదేవీలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ యాప్‌ను రూపొందించింది. ఇది గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్ లలో అందుబాటులో ఉంది. ఇప్పటికే ఇతర యూపీఐ యాప్‌లలో రిజిస్టర్ అయిన కెనరా బ్యాంక్ ఖాతాదారులు సైతం సులభంగా మార్చుకోవచ్చు. కెనరా ఏఐ 1పే పేరుతో కొత్త యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ (యూపీఐ)ను ప్రారంభించింది. ఈ యాప్ ద్వారా ఏ బ్యాంకు ఖాతానైనా లింక్ చేసుకొని వేగంగా, సురక్షితంగా డిజిటల్ చెల్లింపులు చేసుకోవచ్చు. వ్యక్తిగత వినియోగదారులతో పాటు వ్యాపారులు, చిన్న దుకాణాలు, స్వయం ఉపాధి వ్యక్తులు సైతం సులభంగా చెల్లింపులు స్వీకరించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఫీచర్ల విషయానికి వస్తే, నెలవారీ ఖర్చుల విశ్లేషణ, కేటగిరీల వారీగా వివరాలు, ఆర్థిక ట్రెండ్స్ వంటి ఆర్థిక నిర్వహణకు సహాయపడుతుంది. హెూమ్ స్క్రీన్ లోనే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి త్వరగా చెల్లింపులు జరపవచ్చు. చిన్న మొత్తాలను చెల్లించేందుకు పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం కూడా ఉండదు. బిల్లులు, సబ్‌స్క్రిప్షన్లు, ఈఎంఐలు, ఎస్ఐపీల ఆటోమెటిక్ చెల్లింపులు కూడా చేసుకోవచ్చు. భద్రత విషయానికి వస్తే బయోమెట్రిక్ లాగిన్, డివైజ్ బైండింగ్ (రిజిస్టర్ మొబైల్ నుంచి మాత్రమే లావాదేవీలు) వంటి మల్టీ లెవెల్ సెక్యూరిటీ అందుబాటులో ఉంది. అంతేకాకుండా అనుమానాస్పద లావాదేవీలను తక్షణం గుర్తించి హెచ్చరికలు చేస్తుంది.

# ఏఐతో ప్రజల బంధాలు సరికొత్త దశకు


**మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ఆసక్తికర వ్యాఖ్యలు**



వాషింగ్టన్: చాట్‌బాట్స్ ఆవిర్భావంతో కృత్రిమ మేధను ప్రజలు వినియోగించే విధానం పూర్తిగా మారిపోయింది. చాట్‌జీపీటీ-5, గ్రాక్, పర్‌ప్లెక్సిటీ ఏఐ, మెటా ఏఐ వంటి ఆధునిక లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ప్రజల రోజువారీ జీవితంలో అసాధారణ సేవలందిస్తున్నాయి. ఇప్పటికే కొందరి జీవితాల్లో అయితే ఇవి విడదీయలేని భాగంగానే మారిపోయాయి. ఈ నేపథ్యంలో టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్ తాజాగా 'బ్రేక్‌డౌన్' పాడ్‌కాస్ట్‌లో చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీశాయి. భావోద్వేగాలను వ్యక్తపరచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి చాలామంది ఏఐ చాట్‌బాట్స్‌ను ఆశ్రయిస్తున్నారని ఆయన వెల్లడించారు. కుటుంబ సమస్యలు, ఒంటరితనం, బ్రేకప్ వంటి సందర్భాల్లో ప్రజలు ఈ ఏఐ సహచరులతో మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. "అవి చికిత్స ఇవ్వవు, సమస్యలకు పరిష్కారం సూచించవు. కానీ సానుభూతితో, గౌరవంతో మన మాటలు వింటాయి. ఆ వినడం ద్వారా మన బాధ కొంత తగ్గుతుంది. అలా మన ప్రయాణాన్ని మెరుగ్గా కొనసాగించగలం" అని ముస్తఫా తెలిపారు. మరోవైపు, మానవ జీవనంలో ఏఐ తీసుకొస్తున్న మార్పు ఇదేనని నిపుణులు కూడా భావిస్తున్నారు. గతంలో స్నేహితులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులతోనే భావోద్వేగాలను పంచుకునేవాళ్లం. ఇప్పుడు ఏఐ వరకు విస్తరించడం ఒక కొత్త దశకు నాంది పలికింది. అయితే, ఇదే సమయంలో చాట్‌బాట్స్ వాడకంలో జాగ్రత్త తప్పనిసరి అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలామంది తమ వ్యక్తిగత రహస్యాలు, గతంలో చేసిన తప్పులు, మానసిక బలహీనతలను కూడా ఏఐతో పంచుకుంటున్నారు. పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఈమెయిల్ వంటి సున్నితమైన సమాచారం ఏఐకి చెప్పడం ప్రమాదకరమని వారు చెబుతున్నారు. ఏఐ వ్యవస్థలు గోప్యతకు పూర్తి హామీ ఇవ్వలేవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డేటా లీక్ అయ్యే ప్రమాదం ఉండటంతో వ్యక్తిగత సమాచారాన్ని చాట్‌బాట్స్‌తో పంచుకోకుండా ఉండటమే ఉత్తమమని సూచిస్తున్నారు.

# టొరంటోలో భారత యువతి హత్య

**'ఇంటిమేట్ పార్ట్‌నర్' పనేనని అనుమానం**



ఒట్టావా: కెనడాలోని టొరంటోలో భారత సంతతికి చెందిన 30 ఏళ్ల యువతి హిమాన్షి ఖురానా దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటనలో 32 ఏళ్ల అబ్దుల్ గఫూరి అనే వ్యక్తిని ప్రధాన నిందితుడిగా గుర్తించిన పోలీసులు, అతనిపై ఫస్ట్-డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేసి, దేశవ్యాప్తంగా అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. బాధితురాలు, నిందితుడు ఇద్దరికీ ముందునుంచే పరిచయం ఉందని, ఇది 'ఇంటిమేట్ పార్ట్‌నర్ వయలెన్స్' (సన్నిహిత భాగస్వామి హింస) కేసుగా పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, డిసెంబర్ 19వ తేదీ రాత్రి హిమాన్షి ఖురానా కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు గాలింపు చర్యలు చేపట్టగా, డిసెంబర్ 20వ తేదీ ఉదయం 6:30 గంటలకు స్ట్రాచన్ అవెన్యూ, వెల్లింగ్టన్ స్ట్రీట్ వెస్ట్ ప్రాంతంలోని ఒక నివాసంలో ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. దీనిని హత్యగా నిర్ధారించిన పోలీసులు, దర్యాప్తును హెూమిసైడ్ విభాగానికి అప్పగించారు. ఈ ఏడాది టొరంటోలో నమోదైన 40వ హత్య ఇదేనని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై టొరంటోలోని భారత కాన్సులేట్ జనరల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. "యువ భారతీయ పౌరురాలు హిమాన్షి ఖురానా హత్య మమ్మల్ని తీవ్ర విచారానికి గురిచేసింది. ఈ కష్టకాలంలో ఆమె కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. గత కొన్ని రోజులుగా మేము ఈ విషయంపై స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతూ, బాధిత కుటుంబానికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నాము" అని ఒక ప్రకటనలో పేర్కొంది. నిందితుడు అబ్దుల్ గఫూరి ఫోటోను విడుదల చేసిన టొరంటో పోలీసులు, అతని ఆచూకీ తెలిసిన వారు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రస్తుతం గఫూరి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.



# యూనస్ పారిపోవాల్సి వస్తుంది

**హాదీ సోదరుడు ఒమర్ హెచ్చరిక**

ఢాకా: బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులు ఉద్రిక్తతతో నిండిపోయాయి. హింసాత్మక ఘటనలతో దేశం అట్టుడుకుతోంది. ఇటీవల జరిగిన యువ నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్య దేశవ్యాప్తంగా హింసకు దారితీసింది. తాజాగా హాదీ సోదరుడు ఒమర్ సంచలన ఆరోపణలు చేశారు. హాదీ హత్యలో తాత్కాలిక ప్రభుత్వం పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. "మీరు హాదీని చంపారు. ఈ ఘటనను వాడుకుని వచ్చే ఏడాది జరగాల్సిన ఎన్నికలను రద్దు చేయాలని చూస్తున్నారు. హాదీని హత్య చేసిన వారిని వెంటనే పట్టుకోండి. హాదీ హత్య విషయంలో న్యాయం జరగకుంటే, తాత్కాలికక ప్రభుత్వ అధినేత ముహమ్మద్ యూనస్ కూడా ఒక రోజు బంగ్లాదేశ్‌ను విడిచి పారిపోవాల్సి వస్తుంది" అని ఆయన హెచ్చరించారు. హాదీ గతేడాది విద్యార్థి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఆ ఉద్యమం షేక్ హసీనా ప్రభుత్వాన్ని దేశం వీడే స్థితికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో, హాదీ హత్య ఘటన బంగ్లాలో ఉత్కంఠకర రాజకీయ పరిణామాలను సృష్టించింది. ఇక, మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీపై తాత్కాలిక ప్రభుత్వం నిషేధం విధించింది. దీని వలన వచ్చే ఏడాది జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నిర్ణయంపై అమెరికా చట్ట సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రజలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుత విధానంలో ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు ఉంది. అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలి" అని వారు సూచించారు. అవామీ లీగ్‌పై విధించిన నిషేధాన్ని పునఃసమీక్షించాలని కోరారు.

# మునీర్ ప్రగల్భాలు ఆపు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ పై ఆ దేశ ప్రతిపక్ష నేత, జమియత్ ఉలేమా ఇ ఇస్లాం పార్టీ నాయకుడు మౌలానా ఫజ్లూర్ రెహ్మాన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పాక్ పై భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ దాడులపై ఫజ్లూర్ మాట్లాడుతూ... ఆఫ్ఘనిస్థాన్ లోని శత్రువులపై పాకిస్థాన్ సైనిక దాడులను మనం సమర్థించుకుంటే, పాక్ గడ్డపై ఉన్న ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని భారత్ నిర్వహించిన దాడులను ఆ దేశం కూడా సమర్థించుకుంటుందని అన్నారు. ఆఫ్ఘన్ పై పాక్ నిర్వహించిన సైనిక దాడులను ఆయన ఖండించారు. పాక్ దాడుల్లో చాలా మంది ఆఫ్ఘన్ పౌరులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆఫ్ఘన్ లోని మా శత్రువులపై దాడి చేశామని మీరు చెబితే... పాక్ లోని బవల్పూర్ లోని ఉగ్రవాదులపై దాడి చేశామని భారత్ చెప్పుకుంటుందని అన్నారు.



# చేతులు కలిపిన ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రే

ముంబై మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కీలక పరిణామం

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రెండు దశాబ్దాల తర్వాత ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రే కలుసుకున్నారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికల్లో శివసేన (యూబీటీ), ఎంఎన్ఎస్ కలిసి పోటీ చేస్తాయని ఇరువురు అగ్రనేతలు ప్రకటించారు. ముంబైకి మరాఠీ మేయర్ వస్తారని రాజ్ థాక్రే పేర్కొనగా, ఏం జరిగినా ముంబై తమతోనే ఉంటుందని ఉద్ధవ్ థాక్రే వెల్లడించారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 28 కార్పొరేషన్లకు జనవరి 15న పోలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అలాగే, 32 జిల్లాల కౌన్సిళ్లు, 336 పంచాయతీ సమితులకు ఒకే విడతలో ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేయనున్నట్లు ప్రకటించాయి. ఇదొక చారిత్రాత్మక ప్రారంభమని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ అభివర్ణించారు. బీజేపీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనతో అసంతృప్తితో ఉన్న వారు తమతో కలిసి రావొచ్చని ఆహ్వానించారు. 2005లో విడిపోయిన వీరు దాదాపు 20 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకున్నారు. కొన్ని నెలల క్రితం తొలిసారి ఈ ఇద్దరు ఒకే వేదికపై కనిపించారు. థాక్రే సోదరుల కలయికపై బీజేపీ స్పందించింది. వారి పొత్తు చారిత్రక ఓటమికి నాంది అవుతుందని పేర్కొంది. ఉద్ధవ్ థాక్రే కాంగ్రెస్, శరద్ పవార్‌లతో కలిసిన విషయాన్ని ఈ సందర్భంగా బీజేపీ గుర్తు చేసింది. శివసేనతో కలిస్తే రాజ్ థాక్రేకు ఓటమి తప్ప మరేమీ ఉండదని అన్నారు.

# అరుణాచల్‌పై చైనా కుయుక్తులు

**రాజీపడని అంశంగా భావన**

**అమెరికా పెంటగాన్ రిపోర్టు**

న్యూయార్క్: అరుణాచల్ ప్రదేశ్ తమకెంతో ముఖ్యమని, రాజీపడని ప్రయోజనాల్లో ఒకటని చైనా భావిస్తోందని అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించిన నివేదికలో పెంటగాన్ పేర్కొంది. 2049 నాటికి జాతీయ పునరుజ్జీవనాన్ని సాధించాలనే లక్ష్యంతో చైనా ఉందని నివేదిక వెల్లడించింది. అంతేకాకుండా, చైనా తన నాయకత్వ పరిధిని విస్తరించాలని భావిస్తున్నట్లు పెంటగాన్ అభిప్రాయపడింది. తైవాన్, సెంకాకు ద్వీపాలతో పాటు అరుణాచల్ ప్రదేశ్ కూడా బీజింగ్ యొక్క విస్తృత జాతీయ భద్రతా ప్రణాళికల్లో భాగమని తెలిపింది. ఈ భూభాగాలు చైనా జాతీయ పునరుజ్జీవనానికి కీలకమని డ్రాగన్ భావిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. చైనా కమ్యూనిస్టు పాలనను వ్యతిరేకించిన హాంగ్‌కాంగ్, టిబెట్, తైవాన్ రాజకీయ నాయకులను వేర్పాటువాదులుగా ముద్ర వేసినట్లు కూడా నివేదిక తెలిపింది. వాస్తవాధీన రేఖ వెంబడి ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ భారత్, చైనా మధ్య కుదిరిన గస్తీ ఒప్పందం గురించి పెంటగాన్ తన నివేదికలో ప్రస్తావించింది. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించడానికి చైనా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెంటగాన్ నివేదిక పేర్కొంది. అమెరికా, భారత్ మధ్య సంబంధాలు మరింత బలపడకుండా ఉండేలా చైనా జాగ్రత్త పడుతోందని వివరించింది. జాతీయ పునరుజ్జీవనానికి బీజింగ్ మూడు ప్రధాన ప్రయోజనాలను లక్ష్యంగా పెట్టుకుందని, అందులో చైనా కమ్యూనిస్టు పార్టీపై నియంత్రణ, దేశ ఆర్థికాభివృద్ధి, సార్వభౌమాధికారం, ప్రాదేశిక వాదనలు కొనసాగించడం వంటివి ఉన్నాయని పేర్కొంది.



## అమెరికా సుప్రీంకోర్టులో ట్రంప్‌కు షాక్!

న్యూయార్క్: ఇల్లినాయ్ రాష్ట్రంలోకి నేషనల్ గార్డ్ బలగాలను పంపాలన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 6-3 ఓట్ల తేడాతో ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించింది. ఇల్లినాయ్ లో చట్టాలను అమలు చేయడానికి మిలిటరీని ఉపయోగించే అధికారం ప్రభుత్వానికి ఎక్కడి నుంచి వచ్చిందో నిరూపించడంలో యంత్రాంగం విఫలమైందని కోర్టు తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ వివాదం అక్టోబర్ 4న మొదలైంది. షికాగో పరిసర ప్రాంతాల్లో భద్రత కోసం ఇల్లినాయ్ నేషనల్ గార్డ్‌కు చెందిన 300 మంది సభ్యులను ట్రంప్ ఫెడరల్ సర్వీసులోకి పిలిచారు. ఆ తర్వాతి రోజే టెక్సాస్ నేషనల్ గార్డ్‌ను కూడా షికాగోకు పంపారు. అయితే, ఫెడరల్ బలగాల మోహరింపును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై గతంలోనే జిల్లా కోర్టు, అప్పీల్ కోర్టు స్టే ఇచ్చాయి. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆ స్టేను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు తీర్పుపై వైట్ హౌస్ అధికార ప్రతినిధి అబిగైల్ జాక్సన్ స్పందిస్తూ.. ఫెడరల్ భవనాలు, ఆస్తులను అల్లరిమూకల నుంచి రక్షించడానికి, ఫెడరల్ అధికారులకు రక్షణ కల్పించడానికే అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నారని సమర్థించుకున్నారు. బలగాల మోహరింపును మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న ఇల్లినాయ్ డెమొక్రాటిక్ గవర్నర్ జేబీ ప్రిట్జ్కర్, షికాగో మేయర్ ఈ తీర్పును స్వాగతించారు. "ఇది ఇల్లినాయ్ రాష్ట్రానికి, అమెరికా ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయం" అని అభివర్ణించారు.

## అమెరికాలో 30 మంది భారతీయుల అరెస్ట్

**అక్రమంగా ఉంటున్నారని వెల్లడి**


న్యూయార్క్: అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 30 మంది భారతీయులను యూఎస్ బోర్డర్ పెట్రోల్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరు కమర్షియల్ డ్రైవర్ లైసెన్సులు (సీడీఎల్) కలిగి ఉండి, భారీ సెమీ ట్రక్ వాహనాలను నడుపుతున్నట్లు గుర్తించారు. కాలిఫోర్నియాలోని ఎల్ సెంట్రో సెక్టర్‌లో జరిగిన తనిఖీల్లో ఈ అరెస్టులు జరిగాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) వెల్లడించింది. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 12 వరకు ఇంటర్ స్టేట్ హైవేలు, ఇమిగ్రేషన్ చెక్‌పోస్టుల వద్ద జరిగిన తనిఖీల్లో మొత్తం 42 మంది అక్రమ వలసదారులను పట్టుకున్నారు. వీరిలో 30 మంది భారతీయులు కాగా, మిగిలిన వారు ఎల్‌సాల్వడార్, చైనా, హైటి, మెక్సికో, రష్యా తదితర దేశాలకు చెందినవారు. వీరికి కాలిఫోర్నియా సహా ఫ్లోరిడా, న్యూయార్క్, న్యూజెర్సీ వంటి రాష్ట్రాలు కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 10, 11 తేదీల్లో 'ఆపరేషన్ హైవే సెంటినెల్' పేరుతో ఐసీఈ, హెూంల్యాండ్ సెక్యూరిటీ సంస్థలతో కలిసి భారీ స్థాయి దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో మరో 45 మంది అక్రమ వలసదారులు అరెస్ట్ అయ్యారు. కాలిఫోర్నియాలోని ట్రక్కింగ్ కంపెనీలే లక్ష్యంగా ఈ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఇటీవల అక్రమంగా ప్రవేశించిన వ్యక్తులు ట్రక్కులు నడుపుతూ చేసిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోవడం ఈ చర్యలకు కారణమైంది. భారతీయ డ్రైవర్ల కారణంగా జరిగిన కొన్ని ప్రమాదాల్లో యువకులు, చిన్నారులు మరణించగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. "ఇలాంటి వ్యక్తులు ఎప్పుడూ సెమీ ట్రక్‌లు నడపకూడదు. ప్రజల భద్రతే మా ప్రథమ లక్ష్యం" అని ఎల్ సెంట్రో సెక్టర్ యాక్టింగ్ చీఫ్ జోసెఫ్ రెమెనార్ స్పష్టం చేశారు.



## టర్కీలో ఘోర విమాన ప్రమాదం

**లిబియా సైన్యాధిపతి దుర్మరణం**

అంకారా: టర్కీ రాజధాని అంకారాలో మంగళవారం రాత్రి ఘోర విమాన ప్రమాదం సంభవించింది. లిబియా సైన్యాధిపతి జనరల్ మహమ్మద్ అలీ అహ్మద్ అల్-హద్దాద్‌తో సహా ఎనిమిది మంది ప్రయాణిస్తున్న ప్రైవేట్ జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక లోపంతో కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న ఐదుగురు ఉన్నతాధికారులు, ముగ్గురు సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రక్షణ రంగ చర్చల నిమిత్తం టర్కీకి వచ్చిన లిబియా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పర్యటన ముగించుకుని తిరిగి బయలుదేరిన 30 నిమిషాలకే ఈ విషాదం చోటుచేసుకుంది. అంకారాలోని ఎసెన్‌బోగా విమానాశ్రయం నుంచి రాత్రి 8:30 గంటలకు బయలుదేరిన 'ఫాల్కన్ 50' బిజినెస్ జెట్ దక్షిణాన ఉన్న హేమనా జిల్లా వద్దకు రాగానే రాడార్‌తో సంబంధాలు కోల్పోయింది. విమానంలో ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు స్థానిక టీవీ చానళ్లు ప్రసారం చేసిన సీసీటీవీ దృశ్యాల్లో కనిపిస్తోంది. ఈ ప్రమాదంపై లిబియా ప్రధాని అబ్దుల్ హమీద్ దబీబా స్పందిస్తూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం ఒక గొప్ప సైనిక మేధావిని కోల్పోయిందని, ఇదొక తీరని లోటని పేర్కొన్నారు.



వయ్యారి చిత్రం






## అటు ఆవిడ.. ఇటు ఈయన!

విజయ్ దేవరకొండ నటిస్తున్న రౌడీ జనార్ధన, రష్మిక మందన్న ప్రధాన పాత్రలో వస్తున్న మైసా సినిమాలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లు సోషల్ మీడియాలో భారీ చర్చకు దారి తీస్తున్నాయి. ఈ రెండు సినిమాల పోస్టర్లు కూడా నటీనటుల మునుపటి ఇమేజ్‌కు భిన్నంగా, అత్యంత వైల్డ్, ఇంటెన్స్ లుక్స్‌తో ఉండటం గమనార్హం. మైనసాలో రష్మిక మునుపెన్నడూ లేని విధంగా ఒక గిరిజన యోధురాలిగా కనిపించారు. ముఖంపై రక్తపు మరకలు, చెదిరిన జుట్టు, చేతిలో కత్తితో ఆవేశంగా అరుస్తున్నట్లుగా ఆమె లుక్ ఉంది. గిరిజన సంప్రదాయ చీర, ముక్కు పుడక, మెడలో భారీ ఆభరణాలు మరియు చంద్రవంక ఆకారపు బొట్టుతో ఆమె ఆహార్యం పూర్తిగా వైవిధ్యంగా ఉంది. ఇది గోండు తెగ సంస్కృతి నేపథ్యంలో సాగే ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ అని సమాచారం. ఇక, రౌడీ జనార్ధన టైటిల్ గ్లింప్స్ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ షర్ట్ లేకుండా, వంటి నిండా రక్తంతో, లుంగీ కట్టుకొని ఊర మాస్ అవతార్‌లో కనిపించారు. ఆయన కళ్ళు ఎర్రబడి, చేతిలో కత్తితో తీవ్రమైన ఆవేశాన్ని ప్రదర్శించారు. విజయ్ లుక్ ఒక రౌడీగా, అత్యంత శక్తివంతమైన, వైల్డ్ మేకోవర్‌ను సూచిస్తోంది. ఒక గాయపడిన వ్యక్తి జీవిత ప్రయాణం చుట్టూ తిరిగే యాక్షన్ డ్రామాగా సినిమా రూపొందుతోంది. మొత్తానికి వీరిద్దరు పెళ్లికి ముందు రక్తాన్ని చిందించడంపై సోషల్ మీడియాలో ఫ్యాన్స్ రక్తాభిషేకాలు అంటూ రచ్చ చేస్తున్నారు.




## రాజాసాబ్ రన్‌టైం 3 గంటలు!

టాలీవుడ్ డైరెక్టర్ మారుతి-గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంబోలో వస్తోన్న చిత్రం రాజాసాబ్. హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్, రిద్ధికుమార్ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ఎస్ థమన్ మ్యూజికల్ ఆల్బమ్ నుంచి మరో సాంగ్ వస్తోంది. కాగా ఇప్పుడు రాజాసాబ్ రన్‌టైం టాపిక్ ఆసక్తికరంగా మారింది. కొన్ని సినిమాలకు కథానుగుణంగా లాంగ్ రన్ టైం ఫిక్స్ చేస్తారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇటీవలి కాలంలో వచ్చిన పుష్ప 2, అవతార్ 3, ధురంధర్ సినిమాలు ఈ కేటగిరీలోకే వస్తాయి. ఈ సినిమాలు 3 గంటల 20 నిమిషాలు అంతకంటే ఎక్కువ రన్‌టైంతో ఉన్నాయి. ఇదే లైన్‌లో ప్రభాస్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ రాజాసాబ్ ఉండబోతుందన్న వార్త ఒకటి ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. రాజాసాబ్ మేకర్స్ లాంగ్ రన్‌టైంకే ఎక్కువ ఆసక్తి చూపించారని ఇన్‌సైడ్ టాక్. ఫిలింనగర్ సర్కిల్ కథనాల ప్రకారం రాజాసాబ్ రన్ టైం 3 గంటలు ఉందట. మారుతి టీం టైటిల్స్,క్రెడిట్స్‌తో కలిపి ఈ రన్‌టైం ఫిక్స్ చేసినట్టు టాక్. అంటే మరీ సాగదీసిన ఫీలింగ్ అనిపించదని.. ఇంతకంటే ఎక్కువ రన్‌టైం ఉన్న సినిమాలను చూస్తే అర్థమవుతోంది. రన్ టైం విషయంలో యాక్షన్ ప్యాక్‌డ్ సినిమాల ట్రెండ్‌తో పోలిస్తే రాజాసాబ్ హార్రర్ కామెడీ కావడం.. గ్లామరస్ కోటెంట్‌తోపాటు రొమాన్స్, సాంగ్స్, కామెడీ ఎలిమెంట్స్‌తో ఉండే రన్‌టైంను సంక్రాంతి సీజన్‌కు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




## 'దండోరా' చిత్రానికి 16 సెన్సార్ కట్స్

తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన లేటెస్ట్ చిత్రం 'దండోరా' మరికొద్ది గంటల్లో రిలీజ్‌కు రెడీ అయింది. ఈ సినిమాలో గ్రామాల్లో నెలకొన్న కుల సమీకరణలు, సామాజిక పరిస్థితులను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. మురళీ కాంత్ దేవసోత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శివాజీ, నవదీప్, నందు, బిందు మాధవి, రవికృష్ణ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. అయితే, ఈ సినిమా సెన్సార్ ప్రక్రియలో కొన్ని కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. చిత్రంలో వాస్తవికత కోసం వాడిన కొన్ని పదాలు మరియు కులపరమైన ప్రస్తావనలపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేస్తూ మొత్తం 16 కట్స్‌ను సూచించింది. ఆడియోలో ఉన్న బూతులు, కుల సంబంధిత డైలాగులను మ్యూట్ చేయడంతో పాటు, సబ్‌టైటిల్స్‌లో సైతం తగిన మార్పులు చేసిన తర్వాతే బోర్డు క్లియరెన్స్ ఇచ్చింది. లౌక్య ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రవీంద్ర బెనర్జీ ముప్పనేని నిర్మించిన ఈ చిత్రం 2 గంటల 16 నిమిషాల నిడివితో విడుదల కానుంది.



## రూమర్స్‌కు ఐశ్వర్యా రాయ్ కౌంటర్

బాలీవుడ్లో స్టార్ జంటగా పేరు సొంతం చేసుకున్న ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్ ల గత 2 ఏళ్లుగా విడాకుల రూమర్లు ఏ రేంజ్ లో వినిపించాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అటు ఐశ్వర్య రాయ్ ఇటు అభిషేక్ బచ్చన్ ఇద్దరూ కూడా విడాకుల రూమర్స్ కి చెక్ పెట్టే ప్రయత్నం చేశారు. కానీ ఈ రూమర్స్ మాత్రం ఆగలేదు. ఈ జంట మరొకసారి రూమర్స్ కి చెక్ పెట్టే ప్రయత్నం చేసింది. అందులో భాగంగానే తాజాగా వీరు ముగ్గురు కలిసి విహారయాత్రకు బయలుదేరినట్లు కనిపించారు. ముగ్గురు కూడా నల్లటి దుస్తులు ధరించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు వీరిని ఫోటో తీసే ప్రయత్నం చేయగా.. వారితో ఐశ్వర్య మేరీ క్రిస్మస్ అంటూ శుభాకాంక్షలు తెలియజేసింది. ఇకపోతే ఇప్పటికే ఎన్నోసార్లు వీరు జంటగా కనిపించి.. రూమర్స్ కి చెక్ పెట్టినా రూమర్స్ మాత్రం ఆగలేదు ఇప్పుడు మరొకసారి క్రిస్మస్ సందర్భంగా వెకేషన్ కి బయలుదేరుతూ తాము కలిసే ఉన్నామని.. విడిపోలేదని మళ్లీ చెప్పే ప్రయత్నం చేశారు. కనీసం ఇప్పటికైనా ఈ రూమర్స్ ఆగిపోతాయేమో చూడాలి.



## అవును.. నాలో ఇన్ సెక్యూరిటీ ఉంది: శివాజీ

దండోరా ఈవెంట్ లో చేసిన వ్యాఖ్యలపై యాంకర్ అనసూయ శివాజీపై పలు కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. ఆమె డైరెక్ట్ పేరు మెన్షన్ చేయకుండా ఆడవారి వస్త్రధారణ అనేది వ్యక్తిగత స్వేచ్ఛ అని అది కంట్రోల్ చేయాలనుకోవడం కరెక్ట్ కాదని ఘాటుగా స్పందించారు. అలాగే శివాజీకి ఇన్ సెక్యూరిటీ ఉందని అన్న మాటలకు నటుడు శివాజీ నేడు జరిగిన ప్రెస్ మీట్ లో సూటిగా సమాధానం ఇచ్చారు. అనసూయ గారు తన ఇన్ సెక్యూరిటీ గురించి మాట్లాడారని, అవును తనకు నిజంగానే ఇన్ సెక్యూరిటీ ఉందని ఆయన ఒప్పుకున్నారు. అయితే ఆ ఇన్ సెక్యూరిటీ వెనుక ఉన్న కారణాన్ని ఆయన వివరించారు.

## మీకు దండం రా నాయనా: బన్నీ వాస్



సస్పెన్స్ హారర్ మూవీ 'ఈషా' సినిమా డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటికే సినిమాకు సంబంధించిన టీజర్ ట్రైలర్ సోషల్ మీడియాలో పాజిటివ్ వైబ్స్ ని క్రియేట్ చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో సినిమాను రిలీజ్ చేస్తున్న బన్నీ వాస్ మాట్లాడుతూ సినీ విమర్శకులకు, రివ్యూవర్లకు ఒక ఆసక్తికరమైన విజ్ఞప్తి చేశారు. ఈ సినిమా క్లైమాక్స్ లో ఒక చిన్న థ్రిల్లర్ పాయింట్ రివీల్ అవుతుందట. సినిమా కథ మొత్తం ఆ పాయింట్ చుట్టూనే తిరుగుతుందని, అదే ఈ సినిమాకు ఆయువుపట్టు అని బన్నీ వాస్ వివరించారు. ఆ ఒక్క ట్విస్ట్ మీదే సినిమా విజయం ఆధారపడి ఉందన్నమాట. ఒకవేళ ఆ సస్పెన్స్ పాయింట్ రివ్యూల్లో బయటకు వచ్చేస్తే, థియేటర్ కు వచ్చి సినిమా చూసే ఆడియెన్స్ కు ఆ ఎక్స్ పీరియన్స్ ఉండదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## భయపెట్టించిన రవిబాబు 'రేజర్' గ్లింప్స్



డిఫరెంట్ కాన్సెప్ట్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు రవిబాబు తన తదుపరి సినిమాను అధికారికంగా ప్రకటించారు. పూర్తిగా డైలాగ్‌లేని, భీకరమైన విజువల్స్‌తో కూడిన గ్లింప్స్‌ను విడుదల చేస్తూ, తన కొత్త సినిమా టైటిల్‌ను 'రేజర్'గా వెల్లడించారు. 45 సెకన్ల నిడివి ఉన్న ఈ గ్లింప్స్ పూర్తిగా థ్రిల్లర్ టోన్‌లో సాగింది. చేతులను నరికేయడం, శరీరాన్ని రెండు ముక్కలుగా కోయడం, కత్తితో తల నరికే సన్నివేశాలు చూపిస్తూ, ఒక్క మాట కూడా లేకుండా ప్రేక్షకులను షాక్‌కు గురిచేసింది. విజువల్స్ ఆధారంగా కథా భావనను తెలియజేయడం ఈ గ్లింప్స్ ప్రత్యేకతగా నిలిచింది. ఈ గ్లింప్స్‌లో రవిబాబు తప్ప మరే ఇతర ప్రముఖ నటులు కనిపించలేదు లేదా ప్రకటించడం చేయలేదు. అయితే, చూపించిన సన్నివేశాలు మాత్రం థ్రిల్లర్ సినిమాల అభిమానులను వెంటనే ఆకట్టుకునేలా ఉన్నాయి. ముఖ్యంగా డార్క్, వైలెంట్ థ్రిల్లర్ జానర్‌ను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా గట్టిగా కనెక్ట్ అవుతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని ఫ్లయింగ్ ఫ్రాగ్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ రెండు బ్యానర్లు మరోసారి కలిసి పనిచేస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రేజర్' సినిమాను సమ్మర్ 2026లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

# మహేశ్ బాబు నా ఫేవరెట్





**: వీరేంద్ర సెహ్వాగ్**

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు తన ఫేవరేట్ తెలుగు హీరోనని టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తెలిపాడు. తాను సౌతిండియా మూవీలు ఎక్కువగా చూస్తానని, తెలుగు, తమిళ్ రాకపోయినా.. హిందీలో డబ్ అయిన ప్రతీ చిత్రం చూస్తానని చెప్పాడు. హైదరాబాద్‌లో జరిగిన టాలీవుడ్ ప్రో లీగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీరేంద్ర సెహ్వాగ్.. తెలుగు చిత్రాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. మహేష్ బాబుతో పాటు అల్లు అర్జున్ కూడా తనకు ఇష్టమని తెలిపాడు. రిటైర్మెంట్ అనంతరం తన జీవితం చాలా ప్రశాంతంగా ఉందని చెప్పాడు. 'రిటైర్మెంట్ అనంతరం నాకు చాలా టైమ్ దొరుకుతుంది. దాంతో నేను దక్షిణాది చిత్రాలను ఎక్కువగా చూస్తున్నాను. నా ఫేవరేట్ తెలుగు హీరో మహేష్ బాబు. అతని సినిమాలు చాలా చూశాను. అల్లు అర్జున్ కూడా ఇష్టమే. అల్లు అర్జున్ 'పుష్ప' సినిమా నాపై చాలా ప్రభావం చూపింది. పుష్ప-1, 2 ఇప్పటికే రెండు, మూడు సార్లు చూశాను. అందులోని "తగ్గేదేలే" డైలాగ్, అల్లు అర్జున్ స్టైల్

# శతకాల మోత




## ఒక్క రోజే 22 సెంచరీలు.. రోకో, ఇషాన్ సెంచరీలు

### దుమ్మురేపిన సూర్యవంశీ.. సకిబుల్ గని ఫాస్టెస్ట్ సెంచరీ.. ఒడిశా ప్లేయర్ స్వస్తిక్ డబుల్ సెంచరీ

**ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ తొలి రోజే శతకాల మోత మోగించింది. మ్యాచ్ మొదలైన తొలిరోజే వివిధ జట్లకు చెందిన 22 మంది సెంచరీలు చేశారు. అందులో ఒక డబుల్ సెంచరీ సహా ఫాస్టెస్ట్ సెంచరీ ఉన్నాయి. ఒడిశాకు చెందిన ప్లేయర్ స్వస్తిక్ డబుల్ సెంచరీ చేయగా, 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత విజయ్ హజారే ట్రోఫీ బరిలోకి దిగిన కోహ్లీ.. తొలి మ్యాచ్‌లోనే సెంచరీతో చెలరేగాడు.**

బుధవారం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో ఆంధ్రతో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ తరపున బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ 101 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సలతో 131 పరుగులు చేసాడు. గత ఐదు వన్డే మ్యాచ్‌ల్లో విరాట్ కోహ్లీకి ఇది మూడో శతకం కావడం గమనార్హం. లిస్ట్-ఏ క్రికెట్‌లో విరాట్ కోహ్లీ 330 ఇన్నింగ్స్‌ల్లో 58 శతకాలు నమోదు చేశాడు. సచిన్ 60 సెంచరీల రికార్డ్‌కు రెండు శతకాల దూరంలో ఉన్నాడు.



విరాట్ కోహ్లీ శతకంతో ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముంబయి, సిక్కిం మ్యాచ్‌లో రోహిత్ శర్మ 62 బంతుల్లో సెంచరీ చేశాడు. చివరకు 155 (94 బంతుల్లో, 18 ఫోర్లు, 9 సిక్స్‌లు) పరుగులకు పెవిలియన్‌కు చేరాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో వన్డేల్లో రోహిత్ శర్మకు అత్యంత వేగవంతమైన సెంచరీ. ఈ మ్యాచ్‌లో ముంబై గెలిచింది. ఇక, దేశవాళీ క్రికెట్‌లో జార□ండ్ డైనమైట్, టీమిండియా స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ దుమ్మురేపుతున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఫామ్‌ను కొనసాగిస్తూ దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో సెంచరీతో చెలరేగాడు. జార□ండ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఇషాన్ కిషన్.. ఎలైట్ గ్రూప్-ఏలో భాగంగా కర్ణాటకతో జరిగిన మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 33 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన జార□ండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 412 పరుగుల భారీ స్కోర్ చేసింది. విరాట్ సింగ్(88), కుశాగ్ర(63) హాఫ్ సెంచరీలతో రాణించారు.

### చరిత్ర సృష్టించిన బుడ్డోడు

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. విజయ్ హజారే ట్రోఫీలో తొలి మ్యాచ్‌లోనే ఈ 14 ఏళ్ల కుర్రాడు భారీ శతకంతో చెలరేగాడు. ఈ టోర్నీలో బీహార్ తరపున బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ.. అరుణాచల్ ప్రదేశ్‌తో రాంచీ వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో 36 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. తద్వారా విజయ్ హజారే ట్రోఫీలో సెంచరీ బాదిన అతి పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. అంతేకాకుండా లిస్ట్-ఏ క్రికెట్‌లోనే సెంచరీ బాదిన అతి పిన్న వయస్కుడిగా రికార్డ్ అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఆయూష్ లోహరుక (116), సకిబుల్ గని (128 నాటౌట్) చెలరేగడంతో బీహార్ నిర్ణీత 50 ఓవర్లలో రికార్డు స్థాయిలో 6 వికెట్ల నష్టానికి 574 పరుగులు చేసింది. ఇది విజయ్ హజారే ట్రోఫీ చరిత్రలోనే అత్యధిక స్కోర్. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ ప్రదేశ్ జట్టు 42.1 ఓవర్లలో 177 పరుగులకు కుప్పకూలింది.




# హార్దిక్‌కు ఖేల్ రత్న!

## అర్జున అవార్డు ఎవరికంటే?

ఖేల్ రత్న అవార్డుకు ఎంపిక కమిటీ పేర్లను ఖరారు చేసింది. హాకీ కెప్టెన్ హార్దిక్ సింగ్ ఖేల్ రత్నకు సిఫార్సు చేశారు. ఆశ్చర్యకరంగా, అర్జున అవార్డుకు ఏ క్రికెటర్ ఎంపిక కాలేదు. అర్జున అవార్డుకు మొత్తం 24 మంది ఆటగాళ్ల పేర్లు ఎంపికయ్యారు. క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి అధికారిక గుర్తింపు పొందిన ఐదు సంవత్సరాల తర్వాత మొదటిసారిగా, యోగాసన క్రీడాకారిణి ఆర్తి పాల్ పేరును కూడా అర్జున అవార్డుకు ఇచ్చినట్లు వర్గాలు తెలిపాయి. ఆర్తి జాతీయ, ఆసియా ఛాంపియన్. 2026 ఆసియా క్రీడలలో యోగాసనాన్ని ప్రదర్శన క్రీడగా చేర్చనున్నారు. టోక్యో 2021, పారిస్ 2024 ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు కాంస్య పతకం సాధించడంలో హార్దిక్ సింగ్ కీలక పాత్ర పోషించాడు. ఈ సంవత్సరం ఆసియా కప్‌లో స్వర్ణం గెలుచుకున్న జట్టులో అతను కూడా ఉన్నాడు. ప్రపంచ ఛాంపియన్ క్రీడాకారిణి అయిన 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్‌ను కూడా అర్జున అవార్డుకు సిఫార్సు చేశారు. 2023 ఆసియా క్రీడల్లో రజత పతకాలు సాధించి ఈ సంవత్సరం ఆసియా ఛాంపియన్‌షిప్‌లో రెండవ స్థానంలో నిలిచిన చెస్ ఆటగాళ్ళు విదిత్ గుజరాతీ, తేజస్విన్ శంకర్‌లను కూడా సిఫార్సు చేశారు. ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ అర్జున అవార్డును గెలుచుకున్న చివరి క్రికెటర్, 2023లో అందుకున్నారు. దేశంలో అత్యున్నత క్రీడా పురస్కారమైన ఖేల్ రత్న, ప్రశంసా పత్రం, పతకం, రూ. 2.5 లక్షల నగదు బహుమతితో లభిస్తుంది. అయితే అర్జున అవార్డు రూ. 1.5 లక్షల నగదు బహుమతిని అందిస్తారు.

## క్రీడా అవార్డులకు సిఫార్సు చేసిన జాబితా:

**మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న: హార్దిక్ సింగ్ (హాకీ).**


అర్జున అవార్డు గ్రహీతలు: తేజస్విన్ శంకర్ (అథ్లెటిక్స్), ప్రియాంక (అథ్లెటిక్స్), నరేందర్ (బాక్సింగ్), విదిత్ గుజరాతీ (చెస్), దివ్య దేశ్‌ముఖ్ (చెస్), ధనుష్ శ్రీకాంత్ (చెవిటి షూటింగ్), ప్రణతి నాయక్ (జిమ్నాస్టిక్స్), రాజ్‌కుమార్ పాల్ (హాకీ), సుర్జీత్ (కబడ్డీ) (పారా-షూటింగ్), ఏక్తా భయన్ (పారా-అథ్లెటిక్స్), పద్మనాభ్ సింగ్ (పోలో), అరవింద్ సింగ్ (రోయింగ్), అఖిల్ షియోరాన్ (షూటింగ్), మెహులీ ఘోష్ (షూటింగ్), సుతీర్థ ముఖర్జీ (టేబుల్ టెన్నిస్), సోనమ్ మాలిక్ (రెజ్లింగ్), ఆర్తి (యోగా), గ్బాడ్‌మిన్‌టన్ (యోగా), గ్బాద్‌మిన్‌టన్), లాల్‌రెమ్సియామి (హాకీ), మహ్మద్ అఫ్జల్ (అథ్లెటిక్స్), పూజ (కబడ్డీ).






## చిక్కుల్లో యశ్ దయాల్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ పేసర్ యశ్ దయాల్ చిక్కుల్లో పడ్డాడు. మైనర్ బాలికపై అత్యాచార ఆరోపణల కేసులో అతను దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను జైపూర్ పోక్సో కోర్టు బుధవారం తిరస్కరించింది. క్రికెట్ కెరీర్‌లో ఉన్నత స్థాయి చేరేందుకు అండగా ఉంటానని చెప్పి, లైంగికంగా లోబరుచుకున్నాడని జైపూర్‌కు చెందిన 17 ఏళ్ల యువతి యశ్ దయాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. యశ్ దయాల్ నుంచి లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు ఆ అమ్మాయి వయసు 17 ఏళ్లే కావడంతో ఆర్‌సీబీ పేసర్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని యశ్ దయాల్ తరపున న్యాయవాది పిటిషన్ వేయగా.. జైపూర్ పోక్సో కోర్టు తిరస్కరించింది. ఈ కేసు అత్యంత తీవ్రమైనదని, మైనర్‌కు సంబంధించిన విషయం కావడంతో ముందస్తు బెయిల్ మంజూరు చేయలేమని కోర్టు స్పష్టం చేసింది. అతన్ని అరెస్ట్ చేయకుండా స్టే ఇవ్వడానికి కూడా న్యాయస్థానం నిరాకరించింది.



## నటుడు ఆండ్రియా ప్రెటీతో వీనస్ పెళ్లి

టెన్నిస్ లెజెండ్ వీనస్ విలియమ్స్ వివాహం చేసుకున్నారు. ఇటలీ మూలాలు కలిగిన నటుడు, మోడల్, నిర్మాత ఆండ్రియా ప్రెటిని డిసెంబర్ 19న పెళ్లాడారు. 2024లో పరిచయం అయిన వీరిద్దరూ అనంతరం ప్రేమలో పడి, 2025 జనవరి 31న ఇటలీలోని టస్కనీలో నిశ్చితార్థం జరుపుకున్నారు. సెప్టెంబర్ 2025లో ఇటలీలోని ఇస్చియా ద్వీపంలో కేవలం కుటుంబ సభ్యుల సమక్షంలో తొలి పెళ్లి వేడుకను నిర్వహించగా.. డిసెంబర్ 2025లో ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో ఐదు రోజుల పాటు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఘనంగా మరోసారి పెళ్లి చేసుకున్నారు.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
గురువారం 25-12-2025 | www.evarthalu.com

# రాజధర్మం.. రాష్ట్ర ధర్మం



నేడు అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి

అటల్ బిహారీ వాజ్‌పేయి భారత రాజకీయ యవనికపై ఒక ధ్రువతార. ఆయన జీవితం, రాజనీతిజ్ఞత, దేశభక్తి రాబోయే తరాలకు ఒక దిక్సూచి. భారత రాజకీయాల్లో నైతిక విలువలకు, నిబద్ధతకు మారుపేరు అటల్ బిహారీ వాజ్‌పేయి. కేవలం ఒక రాజకీయ నాయకుడిగానే కాకుండా.. కవిగా, వక్తగా, దార్శనికుడిగా ఆయన ముద్ర అజరామరం.



లక్ష్మణ్ మంగళారపు

నేటి తరం రాజకీయ నాయకులకు, యువతకు ఆయన జీవితం ఒక పాఠ్యపుస్తకం. 1998లో పోఖ్రాన్ అణు పరీక్షల ద్వారా భారత్‌ను అణ్వస్త్ర దేశంగా ప్రపంచ పటంలో నిలబెట్టిన ధీశాలి అటల్. అంతర్జాతీయ ఆంక్షలకు భయపడకుండా దేశ భద్రతే పరమావధిగా ఆయన తీసుకున్న నిర్ణయం 'సామర్థ్యమే శాంతికి పునాది' అనే సందేశాన్ని ఇచ్చింది. 'మనం స్నేహితులను మార్చుకోవచ్చు కానీ పొరుగువారిని కాదు' అంటూనే, కార్గిల్ యుద్ధంలో శత్రువుకు తగిన బుద్ధి చెప్పిన తీరు ఆయనలోని రాజనీతిజ్ఞతకు నిదర్శనం. దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చిన ఘనత ఆయనదే. 'స్వర్ణ చతుర్భుజి' పథకం ద్వారా దేశం నలుమూలలనూ అనుసంధానించడం, 'ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన' ద్వారా మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించడం వంటివి నేటి అభివృద్ధికి పునాదులు. విద్యను ప్రాథమిక హక్కుగా మారుస్తూ ఆయన తెచ్చిన 'సర్వశిక్షా అభియాన్' నేటి విద్యా భారతాన్ని నిర్మిస్తోంది. సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నా, ప్రత్యర్థులను గౌరవించడం ఆయన గొప్పతనం. పార్లమెంటులో ఆయన ప్రసంగాలు విజ్ఞాన సర్వస్వాలు. ప్రజాస్వామ్యంలో విమర్శ ఉండాలి కానీ అది విద్వేషంగా మారకూడదనేది ఆయన జీవితం నేర్పే పాఠం. 20కి పైగా పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడపడం ద్వారా 'సమన్వయ కర్త'గా ఆయన రికార్డు సృష్టించారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని గౌరవించడమే భారతీయత అని నిరూపించారు. ఆయన కవిత్వం భావుకతతో పాటు సామాజిక బాధ్యత ఉంటుంది. 'ఓటమిని చూసి కుంగిపోవద్దు, గెలుపును చూసి విర్రవీగొద్దు' అనే ఆయన మాటలు యువతకు నిరంతర ప్రేరణ. అటల్ బిహారీ వాజ్‌పేయి భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన వేసిన అభివృద్ధి బాట, అందించిన నైతిక విలువలు ఎప్పటికీ సజీవమే. అధికారం కోసం ఆరాటం కంటే, దేశ హితం కోసం తపించడమే నిజమైన దేశభక్తి అని చాటిన ఆ మహనీయుని అడుగుజాడల్లో నడవడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.



# యువతరం.. నవభారతం

భారతదేశం నేడు ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశం. అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న లక్ష్యం నెరవేరాలంటే, ఆ ప్రయాణంలో సుపరిపాలన ఒక కీలకమైన ఆయుధం. కేవలం ప్రభుత్వాలు పథకాలు అమలు చేయడమే కాకుండా, పౌరులు, ముఖ్యంగా యువత భాగస్వాములైనప్పుడే నిజమైన సుపరిపాలన సాధ్యమవుతుంది.



శ్రీనివాస్ కట్కం

**2025** సుపరిపాలన దినోత్సవం ప్రధానంగా గ్రామాల వైపు పాలన అనే నినాదంతో సాగుతోంది. ప్రభుత్వ సేవలు సామాన్యుడి గడప వరకు చేరడమే ఈ నినాదం వెనుక ఉన్న పరమార్థం. యువత తమ పరిసరాల్లోని గ్రామాల్లో డిజిటల్ అక్షరాస్యతను పెంచడం ద్వారా, పారదర్శకతను పెంపొందించే బాధ్యతను భుజాన వేసుకోవాలి. నేటి కాలంలో టెక్నాలజీనే పరిపాలనకు ఊపిరి. ఈ-గవర్నెన్స్ సాధనాలను అర్థం చేసుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి సామాన్యులకు అవగాహన కల్పించడం యువత ప్రథమ కర్తవ్యం. సుపరిపాలన అంటే పారదర్శకత. సమాచార హక్కు చట్టం వంటి సాధనాలను ఉపయోగించి అడిగే ప్రశ్నే జవాబుదారీతనాన్ని పెంచుతుంది. అవినీతి రహిత సమాజం కోసం యువత నైతిక విలువలతో కూడిన నాయకత్వాన్ని అలవర్చుకోవాలి. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, దేశాభివృద్ధిలో క్రియాశీలక భాగస్వాములు కావాలి. ప్రభుత్వ కార్యక్రమాలైన మై భారత్ వంటి వేదికల ద్వారా దేశ నిర్మాణంపై మీ అభిప్రాయాలను పంచుకోవాలి. అటల్ జీ కలలుగన్న స్వయం సమృద్ధ భారతాన్ని నిర్మించాలంటే స్వచ్ఛత అత్యవసరం. 2025 సుపరిపాలన దినోత్సవం సందర్భంగా జరుగుతున్న స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా నిరూపించుకోవాలి. దేశం మీకేమి ఇచ్చిందనే దానికంటే, దేశానికి మీరేమి ఇవ్వగలరన్న ఆలోచనతో ముందుకు సాగడమే ఈ రోజు మనం ఇచ్చే గొప్ప సందేశం. యువత కలలు కనడమే కాదు, ఆ కలలను సుపరిపాలన ద్వారా సాకారం చేసే కర్తలు కావాలి.

# కొత్త దారుల్లో దేశం

భారతదేశం ఉన్నత విద్యా రంగంలో గత దశాబ్ద కాలంలో విప్లవాత్మక మార్పులను చూసింది. 2020లో ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానం ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. గత పదేళ్లలో ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల సంఖ్య గణనీయంగా పెరిగింది. పరిశోధన, ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ అటల్ ఇన్నోవేషన్ మిషన్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వడం ద్వారా అంతర్జాతీయ స్థాయి విద్యను స్థానికంగా అందుబాటులోకి తీసుకువచ్చారు.




ఆరోగ్య రంగంలో భారత్ సాధించిన వృద్ధి అమోఘం. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకం అయిన 'ఆయుష్మాన్ భారత్' ద్వారా కోట్లాది మంది పేదలకు ఉచిత వైద్య సదుపాయం లభిస్తోంది. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలనే లక్ష్యంతో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు వేగవంతం అయింది. కోవిడ్-19 మహమ్మారి సమయంలో స్వదేశీ వ్యాక్సిన్‌లను తయారు చేసి కోవిన్ ప్లాట్‌ఫారమ్ ద్వారా విజయవంతంగా పంపిణీ చేయడం ద్వారా భారత్ తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. అలాగే డిజిటల్ హెల్త్ మిషన్ ద్వారా రోగుల సమాచారాన్ని డిజిటలైజ్ చేసే ప్రక్రియ వేగంగా సాగుతోంది.

డిజిటలైజేషన్ పరంగా భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచింది. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా యూపీఐ ద్వారా నగదు రహిత లావాదేవీలు సామాన్యుడికి కూడా చేరువయ్యాయి. నేడు ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ చెల్లింపులు జరుగుతున్న దేశంగా భారత్ గుర్తింపు పొందింది. ఆధార్, జన్ ధన్ ఖాతాలు, మొబైల్ కనెక్టివిటీ ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా ప్రజల ఖాతాల్లోకి చేరుతోంది. 5జీ సేవలను వేగంగా విస్తరించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇంటర్నెట్ సేవల లభ్యత పెరిగింది, ఇది ఈ-గవర్నెన్స్‌ను మరింత బలోపేతం చేసింది. భారతీయ రైల్వే గత పదేళ్లలో సరికొత్త రూపాన్ని సంతరించుకుంది. సెమీ హైస్పీడ్ రైళ్లు అయిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు భారతీయ రైల్వేలో ఆధునికతకు ప్రతీకగా నిలిచాయి. స్టేషన్ల పునరుద్ధరణ కోసం 'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద వందలాది రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నారు. రైల్వే లైన్ల విద్యుదీకరణ దాదాపు 100 శాతానికి చేరువలో ఉంది. బుల్లెట్ రైలు ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతుండగా, కశ్మీర్‌లో ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే బ్రిడ్జ్ (చీనాబ్ బ్రిడ్జ్) నిర్మాణం ఇంజనీరింగ్ అద్భుతంగా నిలిచింది.

సివిల్ ఏవియేషన్ రంగంలో 'ఉడాన్' పథకం ద్వారా సామాన్యుడికి కూడా విమాన ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. గత పదేళ్లలో విమానాశ్రయాల సంఖ్య రెట్టింపు అయింది. టైర్-2, టైర్-3 నగరాలకు కూడా విమాన సర్వీసులు విస్తరించబడ్డాయి. జేవర్ (నోయిడా), నవీ ముంబై వంటి చోట్ల మెగా విమానాశ్రయాల నిర్మాణం జరుగుతోంది. దేశీయంగా విమానాల రాకపోకలు పెరగడమే కాకుండా, ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి సంస్థలు ప్రపంచంలోనే అతిపెద్ద విమానాల కొనుగోలు ఒప్పందాలు చేసుకుని అంతర్జాతీయ పటంలో భారత విమానయాన రంగాన్ని ముందంజలో ఉంచాయి. రక్షణ రంగంలో భారత్ 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా బలమైన అడుగులు వేసింది. గతంలో అత్యధికంగా రక్షణ సామగ్రిని దిగుమతి చేసుకునే దేశంగా ఉన్న భారత్, ఇప్పుడు ఎగుమతి చేసే దేశంగా ఎదుగుతోంది. తేజస్ యుద్ధ విమానాలు, ఐఎన్ఎస్ విక్రాంత్ విమానవాహక నౌక, బ్రహ్మోస్ క్షిపణులు వంటివి స్వదేశీ సాంకేతికతతో నిర్మించబడ్డాయి. రక్షణ ఉత్పత్తుల తయారీలో ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఎగుమతులు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల కల్పన, సైనిక బలగాల ఆధునికీకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడింది.



**- కాంతంశెట్టి లక్ష్మణరావు**
**రిటైర్డ్ సీనియర్ మేనేజర్,**
**ఇండియన్ బ్యాంక్,బెంగళూరు**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.